


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com
అక్షర
# రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684

## విలేకరులు కావలెను
'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | బుధవారం | 08.07.2026 | సంపుటి: 3 | సంచిక: 156 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | WEDNESDAY | 08.07.2026 | V0LUME : 3 | ISSUE : 156 | PAGES: 8 | COST: 2/- |

# అహ్మదాబాద్ పేలుళ్ల కేసులో ..
# 38 మందికి ఉరిశిక్ష





- 18 ఏళ్ల తర్వాత బాధితులకు న్యాయం
- ప్రత్యేక కోర్టు తీర్పును సమర్థించిన గుజరాత్ హైకోర్టు
- 11 మందికి యావజ్జీవ శిక్ష యథాతథం
- మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం

**అహ్మదాబాద్, జూలై 7**

2008లో దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన అహ్మదాబాద్ వరుస బాంబు పేలుళ్ల కేసులో గుజరాత్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ప్రత్యేక న్యాయస్థానం గతంలో విధించిన శిక్షలను సమర్థిస్తూ 38 మంది దోషులకు మరణశిక్షను ఖరారు చేసింది. మరో 11 మందికి విధించిన యావజ్జీవ కారాగార శిక్షను కొనసాగించింది. పేలుళ్లలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు, గాయపడిన బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని కూడా ఆదేశాలు జారీ చేసింది.

**70 నిమిషాల్లో 21 పేలుళ్లు**

2008 జూలై 26న అహ్మదాబాద్ నగరంలో కేవలం 70 నిమిషాల వ్యవధిలో 21 చోట్ల బాంబులు పేలాయి. రద్దీగా ఉండే మార్కెట్లు, నగర బస్సులు, ఆసుపత్రులను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిగాయి. పేలుళ్లలో 56 మంది మరణించగా, 200 మందికి పైగా గాయపడ్డారు. సైకిళ్లకు అమర్చిన టిఫిన్ బాక్సుల్లో పేలుడు పదార్థాలను ఉంచి దాడులకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది. అనంతరం అహ్మదాబాద్, సూరత్ ప్రాంతాల్లో మరికొన్ని పేలని బాంబులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**దీర్ఘకాల విచారణ**

ఈ ఘటనకు సంబంధించి మొత్తం 78 మందిపై 35 కేసులు నమోదు చేశారు. కేసు విచారణ కోసం ప్రత్యేక న్యాయస్థానాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 14 సంవత్సరాలపాటు సాగిన విచారణ అనంతరం 2022 ఫిబ్రవరిలో ప్రత్యేక

మిగతా 3వ పేజీలో..

## డిజిటల్ గవర్నెన్స్ దిశగా ముందుకు

- క్షేత్రస్థాయి అధ్యయనానికి కమిటీ
- వంద రోజుల్లో కొలిక్కి తీసుకురావాలి
- కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై సీఎం సమీక్ష



**హైదరాబాద్, జూలై 7 :**

పరిపాలనలో మరింత పారదర్శకతకు డిజిటల్ గవర్నెన్స్ దిశగా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఇందుకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయడంతోపాటు అవసరమైన చట్టాలను రూపొందించాలని

మిగతా 2వ పేజీలో..

## కవితకు కలిసి రాని టీఆర్ఎస్



కొత్త పార్టీకి పేరు చిక్కులు..
టీఆర్ఎస్ పేరుకు ఈసీ నిరాకరణ
ప్రత్యామ్నాయ పేర్లు సూచించాలని ఆదేశాలు
'జాగృతి' వైపు చూపు?
న్యాయపోరాటమా.. లేక కొత్త పేరుతో ముందుకా?
రాజకీయ వర్గాల్లో 'జాగృతి' పేరుపై చర్చ

**హైదరాబాద్, జూలై 7 :**

బీఆర్ఎస్‌ను వీడి సొంత రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన కల్వకుంట్ల కవిత తొలి అడుగులోనే పార్టీ పేరు

మిగతా 2వ పేజీలో..

### కవిత పార్టీ పేరుపై ఢిల్లీ హైకోర్టు ట్విస్ట్

- టీఆర్ఎస్ సంక్షిప్త నామంపై వెంటనే జోక్యం చేసుకోబోమన్న కోర్టు
- ఈసీ ముందు వివరణ ఇవ్వాలని కవితకు సూచన
- వ్యక్తిగత వాదనకు అవకాశం కల్పించాలని ఎన్నికల సంఘానికి ఆదేశం

2



## మొబైల్ అంగన్వాడి కేంద్రాలకు శ్రీకారం

- ప్రతి చిన్నారికి సేవలే లక్ష్యంగా ప్రభుత్వ వినూత్న కార్యక్రమం
- వలస కార్మికుల పిల్లలకు పోషకాహారం, ప్రీ-స్కూల్ విద్య అందుబాటులోకి
- మొదటి దశలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ప్రారంభం

3

## తాగునీటి సమస్య రానివ్వం: మంత్రి సీతక్క

- వర్షాభావ పరిస్థితులపై ఉన్నతస్థాయి సమీక్ష
- ప్రతి గ్రామానికి నిరంతరాయ నీటి సరఫరాపై ఆదేశాలు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని సూచన
- జలాశయాల నీటి మట్టాలపై నిరంతర పర్యవేక్షణ

3

## రెవెన్యూ శాఖ బలోపేతమే లక్ష్యం

- రూ.360 కోట్లతో శాశ్వత భవనాలు
- 10 ఆర్డీవో, 107 తహసిల్దార్, 53 సబ్ రిజిస్ట్రార్ భవనాల నిర్మాణం
- రెవెన్యూ మంత్రి పొంగులేటి



**హైదరాబాద్, జూలై 7 :**

రాష్ట్రంలో రెవెన్యూ పాలనను మరింత బలోపేతం చేయడంతోపాటు ప్రజలకు ఆధునిక, గౌరవప్రదమైన సేవలందించాలనే లక్ష్యంతో దశలవారీగా తహసీల్దార్, ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణాన్ని

మిగతా 2వ పేజీలో..

## ఏఐలో ప్రపంచానికి దిక్సూచిగా తెలంగాణ



- బాధ్యతాయుత సాంకేతికతకు కేరాఫ్ అడ్రస్ హైదరాబాద్
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్, జూలై 7 :**

కృత్రిమ మేధస్సు(ఏఐ) రంగంలో ప్రపంచ దేశాలకు తెలంగాణ సరికొత్త దిశానిర్దేశం చేస్తోందని, కేవలం పెట్టుబడులను ఆకర్షించడమే కాక పర్యావరణ

మిగతా 2వ పేజీలో..



## కేంద్ర మంత్రివర్గ విస్తరణకు బ్రేక్?

పార్లమెంట్ సమావేశాలపై ఫోకస్..
వర్షా కాల సమావేశాల షెడ్యూల్ ప్రకటనతో చర్చ
శాసన కార్యక్రమాలకే కేంద్రం ప్రాధాన్యం
రాజ్యాంగ సవరణ బిల్లులపై ప్రభుత్వం దృష్టి
సమావేశాల తర్వాతే మంత్రివర్గ విస్తరణపై నిర్ణయం?

4

## పట్నం, మేడ్చల్, మహేశ్వరంలకు మహర్దశ

- రూ.338 కోట్లతో నాలుగు లేన్ల ఆధునిక రహదారులు
- నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి కోమటిరెడ్డి



**రంగారెడ్డి, జూలై 7:**

ఇబ్రహీంపట్నం, మేడ్చల్, మహేశ్వరం నియోజకవర్గాల్లో హైబ్రిడ్ అన్యుటీ మోడల్ విధానంలో రూ.338 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఆధునిక నాలుగు లేన్ల రహదారుల నిర్మాణ పనులకు రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

మిగతా 3వ పేజీలో..




## కడియంపై క్రమశిక్షణ చర్య తీసుకోవాల్సిందే

- నాకు తెలియకుండా ఎలా సమీక్షలు చేపడతారు
- మంత్రిగా తన శాఖలో జోక్యం చేసుకోవడం ఏమిటి
- సీఎం రేవంత్‌కు మంత్రి సురేఖ లేఖ

2

## ప్రజలకు చేరువగా పోలీసింగ్.. సాంకేతికతతో నేర నియంత్రణ

- నిజాయితీ, నిష్పాక్షికతతో విధులు నిర్వహించాలి
- సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి:
- డీజీపీ సీవీ ఆనంద్



2

# కవిత పార్టీ పేరుపై ఢిల్లీ హైకోర్టు ట్విస్ట్

**న్యూఢిల్లీ, జూలై 7**

కొత్త రాజకీయ పార్టీ పేరుకు సంబంధించి మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. తన పార్టీకి తెలంగాణ రక్షణ సమితి లేదా తెలంగాణ రక్షణ సేన పేరును నమోదు చేసి, టీఆర్ఎస్ సంక్షిప్త నామాన్ని కేటాయించేలా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరిన పిటిషన్‌పై నేరుగా జోక్యం చేసుకోవడానికి హైకోర్టు నిరాకరించింది. ఎన్నికల సంఘం నిర్ణయ ప్రక్రియలో ఈ దశలో జోక్యం చేసుకోవడం సముచితం కాదని స్పష్టం చేసింది.

**ఈసీ అభ్యంతరాలపై వివరణ కోరిన కోర్టు**

కవిత కొత్త పార్టీ పేరుకు సంబంధించి ఎన్నికల సంఘానికి దరఖాస్తు చేయగా, టీఆర్ఎస్ సంక్షిప్త నామంతో పోలిక ఉన్న పేరుపై వెయ్యికి పైగా అభ్యంతరాలు వచ్చినట్లు ఈసీ తెలియజేసింది. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ పేర్లను సూచించాలని కోరుతూ నోటీసులు జారీ చేసింది. అయితే ఈసీ నిర్ణయాన్ని సవాలు చేస్తూ కవిత నేరుగా ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తెలంగాణ ఉద్యమంతో టీఆర్ఎస్ పేరుకు తమకు అనుబంధం ఉందని, ఆ సంక్షిప్త నామాన్ని వినియోగించే హక్కు తమకూ ఉందని ఆమె తరపు న్యాయవాది కోర్టులో వాదించారు.

**ఎన్నికల సంఘం స్వతంత్ర అధికారాలపై వ్యాఖ్యలు**

విచారణ సందర్భంగా టీఆర్ఎస్ సంక్షిప్త నామానికి దగ్గరగా ఉండే పేరును అనుమతించాలా వద్దా అనే అంశం ఎన్నికల సంఘం పరిధిలోని విషయమని హైకోర్టు పేర్కొంది. ఇప్పటికే టీఆర్ఎస్ పేరుతో పోలిక ఉన్న ఇతర రాజకీయ సంస్థలు నమోదై ఉన్నాయని, అలాగే బీఆర్ఎస్ కూడా ఈ అంశంపై అభ్యంతరాలు వ్యక్తం చేసిందని ఎన్నికల సంఘం తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో నేరుగా ఆదేశాలు జారీ చేయడం సరికాదని న్యాయస్థానం అభిప్రాయపడింది.

**వ్యక్తిగత వాదనకు అవకాశం**

అయితే కవితకు హైకోర్టు తాత్కాలిక ఊరటనిచ్చింది. ఎన్నికల సంఘం జారీ చేసిన నోటీసులకు వారం రోజుల్లోగా రాతపూర్వక వివరణ సమర్పించాలని సూచించింది. ఆ వివరణ అందిన తర్వాత ఏకపక్షంగా నిర్ణయం తీసుకోకుండా, కవితకు వ్యక్తిగతంగా తన వాదనలు వినిపించే అవకాశం కల్పించి అనంతరం తుది నిర్ణయం తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. పార్టీ పేరు వ్యవహారంలో ఎన్నికల సంఘం తుది నిర్ణయం ఎలా ఉంటుందన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. టీఆర్ఎస్ సంక్షిప్త నామం లభించకపోతే కవిత ప్రత్యామ్నాయ పేరుతో ముందుకు వెళ్తారా అనే అంశంపైనా చర్చ కొనసాగుతోంది.

# కవితకు కలిసి రాని టీఆర్ఎస్

**మొదటిపేజీ తరువాయి**

వివాదంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పేరుతో కొత్త పార్టీని ప్రకటించినప్పటికీ, ఆ పేరుకు కేంద్ర ఎన్నికల సంఘం అనుమతి నిరాకరించడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. పెద్ద సంఖ్యలో అభ్యంతరాలు రావడంతో ఆ పేరును తిరస్కరించిన ఈసీ, 15 రోజుల్లో మూడు ప్రత్యామ్నాయ పేర్లను సూచించాలని ఆదేశించినట్లు సమాచారం.

**న్యాయపోరాటంపై దృష్టి**

ఈసీ నిర్ణయాన్ని న్యాయస్థానంలో సవాలు చేస్తానని కవిత ప్రకటించినట్లు తెలుస్తోంది. అయితే కొత్త పార్టీ ప్రారంభ దశలోనే పేరు వివాదం కోర్టుల వరకు వెళ్లడం కేడర్‌లో, ప్రజల్లో అయోమయానికి దారితీసే అవకాశముందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీ పేరుపై స్పష్టత లేకపోతే సంస్థాగత నిర్మాణం, ప్రచార కార్యక్రమాలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. చివరకు పేరు మార్చాల్సిన పరిస్థితి వస్తే మరింత గందరగోళం నెలకొనే అవకాశం ఉందని భావిస్తున్నారు.

**'జాగృతి' పేరుపై చర్చ**

కవిత కొత్త పార్టీ ఏర్పాటు చేయనున్నట్లు వార్తలు వచ్చినప్పటి నుంచి ఆమె చాలా కాలంగా నిర్వహిస్తున్న తెలంగాణ జాగృతి సంస్థనే రాజకీయ పార్టీగా మార్చవచ్చనే ప్రచారం జరిగింది. అయితే అనూహ్యంగా టీఆర్ఎస్ పేరును ఎంచుకోవడంతో పరిస్థితి మారింది. తెలంగాణ ఉద్యమ కాలంలో బతుకమ్మ వంటి సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా తెలంగాణ జాగృతి రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందింది. గ్రామ, మండల స్థాయిలో కూడా ఈ సంస్థకు విస్తృత స్థాయిలో కార్యకర్తల నెట్‌వర్క్ ఉందని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.

**త్వరగా స్పష్టత అవసరం**

ఇప్పటికే ప్రజల్లో గుర్తింపు పొందిన తెలంగాణ జాగృతి లేదా దానికి సమానమైన పేరుతో పార్టీని ముందుకు తీసుకెళితే రాజకీయంగా ప్రయోజనం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. చట్టపరమైన వివాదాల్లో సమయం వృథా చేసుకోవడం కంటే, అందుబాటులో ఉన్న ప్రత్యామ్నాయాన్ని ఎంచుకుని సంస్థాగత బలోపేతంపై దృష్టి పెట్టడం మంచిదని కొందరు రాజకీయ విశ్లేషకులు సూచిస్తున్నారు. అయితే పార్టీ పేరుపై కవిత ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# రెండున్నరేళ్లయినా రేవంత్‌కు పాలనపై పట్టు లేదు

- **బీజేపీ ఎంపీ లక్ష్మణ్**

**హైదరాబాద్, జూలై 7:**

అధికారంలోకి వచ్చి 30 నెలలు గడుస్తున్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై కనీస పట్టు సాధించలేకపోయారని బీజేపీ రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ తీవ్రంగా మండిపడ్డారు. ముఖ్యమంత్రి స్వయంగా బాధ్యతలు నిర్వహిస్తున్న విద్యా, హోం, మున్సిపల్ శాఖలు పూర్తిగా అస్తవ్యస్తంగా మారాయని, రాష్ట్రంలో అభివృద్ధి అనేది మచ్చుకైనా కనిపించడం లేదని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజాసమస్యల పరిష్కారం, సంక్షేమాన్ని విస్మరించి,ఎంతసేపూ తమ హైకమాండ్ మెప్పు కోసం ఢిల్లీ పెద్దలను ప్రసన్నం చేసుకుని తన పదవిని కాపాడుకోవడంపైనే ఆరాటపడుతున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో పాలన ఏ రకంగా పడకేసిందో చెప్పడానికి ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీలే నిదర్శనమని లక్ష్మణ్ పేర్కొన్నారు. ఈ 30 నెలల కాలంలోనే రికార్డు స్థాయిలో 24 సార్లు మేజర్ బదిలీలు చేపట్టడం దారుణమన్నారు. సీఎం అనాలోచిత నిర్ణయాల వల్ల అధికారులు ఒక జిల్లాలో లేదా ఒక శాఖలో స్థిరపడి పాలనపై దృష్టి పెట్టి పట్టు సాధించుకునే లోపే మళ్ళీ బదిలీ వేటుకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్, వరంగల్, రంగారెడ్డి, ఖమ్మం, నిజామాబాద్ వంటి పెద్ద జిల్లాల కలెక్టర్లను ఒకటి కంటే ఎక్కువసార్లు బదిలీ చేశారంటే, ప్రభుత్వానికి అధికారులపై నమ్మకం లేదనే విషయం స్పష్టమవుతోంది. దీనివల్ల అధికార యంత్రాంగం పనులపై దృష్టి పెట్టలేకపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి సచివాలయానికి రావడం చాలా అరుదుగా మారిందని, 71 సార్లు దిల్లీ పర్యటనలు చేయడాన్ని చూస్తుంటే రాష్ట్ర పాలన సచివాలయం నుండి జరుగుతున్నదా, దిల్లీ నుండి జరుగుతుల్లన్నదా లేదా దారుస్సలాం నుండి జరుగుతుశ్రీష్ట్రశ్రీదా అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని ఎద్దేవా చేశారు.మరోవైపు రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని, హైదరాబాద్ నగరంతో పాటు జిల్లాలు సైతం డ్రగ్ మాఫియా గుప్పిట్లోకి వెళ్ళిపోయాయని డా. కె. లక్ష్మణ్ ఆందోళన వ్యక్తం చేశారు. రియల్ ఎస్టేట్ రంగం పూర్తిగా కుప్పకూలి నిర్మాణాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయని తెలిపారు. భారత ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా చేపట్టిన ఓటర్ల ప్రక్షాళన (ఎసఐఆర్) ప్రక్రియను తెలంగాణలోని కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు తమ రాజకీయ మనుగడ కోసం వివాదాస్పదం చేస్తూ, ప్రజలను గందరగోళపరుస్తున్నాయని లక్ష్మణ్ మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం మరియు ఆ పార్టీ నాయకులు కేవలం మజ్లిస్ ప్రాపకం కోసం బాధ్యతారహిత వ్యాఖ్యలు చేస్తూ ఓటర్ల ప్రక్షాళనను నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. 'ఒక వ్యక్తికి ఒకే ఓటు' ఉండాలనేది చట్టబద్ధమైన విధానమని, బోగస్ ఓట్లు, దొంగ ఓట్లను తొలగించడమే ఈ ప్రక్రియ ముఖ్య ఉద్దేశమని గుర్తు చేశారు. హైదరాబాద్‌లో బంగ్లాదేశీయులు, రోహింగ్యాలు పెద్దఎత్తున చొరబడి దొంగ ఓట్లు పొందితే, వారికి ఎంఐఎం నాయకుడు అసదుద్దీన్ ఒవైసీ పర్మనెంట్ రెసిడెన్స్ సర్టిఫికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేయడం దుర్మార్గమన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కేవలం ముస్లిం ఓట్ల కోసం మజ్లిస్‌కు వంతపాడుతూ దొంగ ఓట్లను కాపాడే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు.ఈ ప్రక్రియ జూన్ 24న ప్రారంభమై జులై 24తో ముగుస్తుందని, అయితే హైదరాబాద్‌లోనే 40% ఇళ్లకు ఇంకా ఎన్రోల్మెంట్ ఫామ్స్ అందలేదని క్షేత్రస్థాయి పరిశీలనలో తేలిందన్నారు. బీఎల్ ఓలు అధికార పక్షం మరియు ఎంఐఎం ఒత్తిళ్లకు లొంగిపోయి మసీదుల్లో ఏర్పాటు చేసిన క్యాంపుల్లోనే ఫారాలు తీసుకుంటున్నారని ఫైరయ్యారు.

# ప్రజలకు చేరువగా పోలీసింగ్..
# సాంకేతికతతో నేర నియంత్రణ

**ఖమ్మం, జూలై 7**

ప్రజలకు సత్వర న్యాయం అందించేలా, సాంకేతికతను సమర్థంగా వినియోగిస్తూ నేరాలను అరికట్టాలని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ పోలీసు అధికారులను ఆదేశించారు. నిజాయితీ, నిష్పాక్షికత, ప్రజలకు అందుబాటులో ఉండే పోలీసింగ్‌నే లక్ష్యంగా పెట్టుకుని పనిచేయాలని సూచించారు. ఖమ్మంలో నిర్వహించిన నేరాల సమీక్ష సమావేశంలో జిల్లా పోలీసింగ్ పనితీరు, నేర నియంత్రణ చర్యలపై సమగ్ర సమీక్ష నిర్వహించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

**సైబర్ నేరాలపై అప్రమత్తం**

జిల్లాలో ఆర్థిక మోసాలు 30 శాతం, ఉద్యోగాల పేరుతో జరిగే మోసాలు 36 శాతం పెరిగినట్లు సమీక్షలో వెల్లడైంది. నకిలీ పత్రాల కేసులు కూడా పెరుగుతున్నాయని అధికారులు వివరించారు. ఈ ఏడాది సైబర్ నేరాలకు 711 మంది బాధితులై రూ.9.48 కోట్లు కోల్పోగా, అందులో రూ.1.41 కోట్లను పోలీసులు తిరిగి బాధితులకు అందించారు. ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు సైబర్ నేరాలపై మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని డీజీపీ సూచించారు.

**మాదకద్రవ్యాలపై రాజీలేని పోరు**

మాదకద్రవ్యాల నిర్మూలనకు యుద్ధప్రాతిపదికన చర్యలు కొనసాగించాలని డీజీపీ ఆదేశించారు. ఈ ఏడాది జిల్లాలో 1,700 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో అత్యధికంగా గంజాయి పట్టుబడుతున్న జిల్లాల్లో ఖమ్మం ఒకటిగా ఉందని పేర్కొంటూ, యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు మరింత కఠినంగా వ్యవహరించాలని సూచించారు.

**సాంకేతికతతో భద్రత బలోపేతం**

పర్యటన సందర్భంగా జిల్లా కమాండ్ సెంటర్‌కు అనుసంధానించిన 250 కొత్త సీసీ కెమెరాలు, కమిషనరేట్ సీసీ కెమెరాల కమాండ్ సెంటర్‌ను డీజీపీ ప్రారంభించారు. గ్రామాల్లో స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన ప్రజలను అభినందించారు. రోడ్డు భద్రతా పార్కును సందర్శించి విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. గత ఏడాది 317గా ఉన్న రోడ్డు ప్రమాదాల సంఖ్య ఈ ఏడాది 146కు తగ్గడం అభినందనీయమని పేర్కొన్నారు.

పోలీసులు చట్టానికి లోబడి నిష్పాక్షికంగా విధులు నిర్వహించాలని, పేదలు, బలహీన వర్గాలకు ముందుగా న్యాయం అందేలా పనిచేయాలని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. రాత్రి గస్తీని మరింత బలోపేతం చేయడంతో పాటు ఇసుక, మట్టి అక్రమ రవాణా, రౌడీ మూకలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీసీటీఎన్ఎస్ 3.0, హాక్ ఐ 3.0, టీజీ కాప్స్ 3.0 వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థలను సమర్థంగా వినియోగించాలని సూచించారు. త్వరలో ప్రత్యేక ట్రాఫిక్ నిర్వహణ బ్యూరోను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

# డిజిటల్ గవర్నెన్స్ దిశగా ముందుకు

**మొదటిపేజీ తరువాయి**

ఆదేశించారు. ఎంసీఆర్ హెచఆర్డీలోని బోధి పెవిలియన్‌లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం సమీక్ష నిర్వహించారు. ప్రజలకు మెరుగైన సేవలను అందించడంతోపాటు సంక్షేమ పథకాలు నేరుగా లబ్దిదారులకు చేర్చేందుకు డిజిటల్ గవర్నెన్స్ ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగులతోపాటు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు అందించేందుకు వివిధ విభాగాల్లోని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, జీతాలు, బ్యాంక్ అకౌంట్ వివరాలను పూర్తిగా డిజిటలైజ్ చేయాలన్నారు. రాష్ట్రంలో దాదాపు 4,800 కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు ఉండగా ఇందులో 4,300 ఏజెన్సీలు ఉద్యోగులకు ఈఎసఐ, పీఎఫ్ చెల్లించడం లేదని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఏజెన్సీలకు ప్రభుత్వం చెల్లింపులు చేసినా ఉద్యోగులకు సమయానికి జీతాలు చెల్లించడం లేదని తెలిపారు. దీనిపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందని, అలాంటి ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. డిజిటల్ గవర్నెన్స్‌తో సమస్యకు చెక్ పెట్టాలని సూచించారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటి నుంచి 5వ తేదీలోగా పారదర్శకంగా జీతాల చెల్లింపులు జరిపేందుకు డిజిటల్ గవర్నెన్స్ ఉపయోగపడుతుందన్నారు. అందుకే పూర్తి వివరాలను డిజిటలైజ్ చేయాలన్నారు. ఇందుకు వివిధ విభాగాల అధికారులతో ఒక కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. కమిటీ వంద రోజుల్లో ఈ అంశాన్ని కొలిక్కి తీసుకు రావాలని ఆదేశించారు. హెల్త్ కార్డులు, ఇతర బెనిఫిట్స్ అమలుకు ప్రభుత్వ ఉద్యోగుల వివరాలను కూడా డిజిలైజ్ చేయాలన్నారు. నిరంతరం పర్యవేక్షించేందుకు ఆర్థిక శాఖ విభాగం ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సలహాదారు రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఎంఏ అండ్ య□డీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎం ప్రధాన కార్యదర్శి వి.శేషాద్రి, ఎంసీహెచఆర్‌డీ వైస్ చైర్మన్ శాంతికుమారి, వేతన సవరణ కమిషనర్ ఎన్.శివశంకర్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రణాళికా విభాగం కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# కడియంపై క్రమశిక్షణ చర్య తీసుకోవాల్సిందే

**హైదరాబాద్,జూలై 7:**

స్టేషన్ ఘన్‌పూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తీరుపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్న నన్ను, నా కార్యాలయాన్ని పూర్తిగా విస్మరించి, ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా కడియం శ్రీహరి కమిషనర్ ఆఫీస్‌లో అధికారిక సమీక్షా సమావేశం నిర్వహించారని ఫిర్యాదు చేశారు. మాస్టర్ ప్లాన్లు, శాఖాపరమైన నివేదికలపై ఆదేశాలు జారీ చేయడం మంత్రి పరిధిలోని అంశమని, ఒక ఎమ్మెల్యే దేవాదాయ శాఖ అధికారులను పిలిచి ఎలా ఆదేశిస్తారని సురేఖ ప్రశ్నించారు. కడియం శ్రీహరి చర్య ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థలో అనుచిత సంప్రదాయానికి నాంది అని, ఇది కేవలం పరిపాలనా లోపం మాత్రమే కాదని, ఒక శాఖ మంత్రి అధికారాలను బహిరంగంగా ప్రశ్నించే కుట్ర అని ఆమె మండిపడ్డారు. గతంలోనూ ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలను రెచ్చగొట్టి తనపై శ్రీహరి దుష్ప్రచారం చేశారని సురేఖ ఆరోపించారు. ఇప్పుడు కూడా ఉద్దేశపూర్వకంగానే తనను నిర్లక్ష్యం చేస్తూ ఆయన తీసుకుంటున్న చర్యల వల్ల శాఖ అధికార యంత్రాంగంలో తీవ్ర అయోమయం నెలకొందని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ప్రజాప్రతినిధిగా ఉంటూ ప్రభుత్వ నిబంధనలను, మంత్రి అధికారాలను అతిక్రమించిన కడియంపై పార్టీ క్రమశిక్షణా కమిటీ ద్వారా విచారణ జరిపించాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఆయనపై తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని సురేఖ కోరారు. మంత్రిగా తనకు సమాచారం ఇవ్వకుండా దేవాదాయ శాఖపరమైన సమీక్ష నిర్వహించారని, ఆయన సమీక్షించడం పరిపాలనా వ్యవస్థకు విరుద్ధమని పేర్కొన్నారు. శాఖ మంత్రిగా అన్ని అధికారాలు తనకే ఉంటాయాన్న సురేఖ.. కడియం వ్యవహారంపై పార్టీ, ప్రభుత్వ స్థాయిలో విచారణ చేపట్టాలని కోరారు. సమస్య ఉంటే మంత్రి, అధికారులకు వినతిపత్రం ఇవ్వాలి కానీ సమీక్ష నిర్వహించడం ఏంటని ప్రశ్నించారు.

# ఏఐలో ప్రపంచానికి దిక్సూచిగా తెలంగాణ

**మొదటిపేజీ తరువాయి**




పరిరక్షణ, సామాజిక ప్రయోజనాలను జోడించి 'ఏఐ ప్రమాణాలకు దిక్సూచి'గా తెలంగాణ నిలుస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. హైదరాబాద్‌లోని హెచఐసిసి వేదికగా జరిగిన 'గ్రీన్ గ్రోత్ ఎకానమిక్ సమ్మిట్ ది హైదరాబాద్ కలెక్టివ' కార్యక్రమాన్ని పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి ఆయన మంగళవారం ప్రారంభించారు. 'ది మెరిడియన్ కలెక్టివ' ఆధ్వర్యంలో రెండు రోజులపాటు ఈ సమ్మిట్ జరగనుంది. వివిధ దేశాల ప్రతినిధులనుద్దేశించి డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఏఐ అంటే కేవలం క్లౌడ్ కంప్యూటింగ్, సర్వర్లు మాత్రమే కాదని, దీని వెనుక విద్యుత్, నీరు, భూమి, మానవ వనరుల భాగస్వామ్యం ఉంటుందని ప్రభుత్వం గుర్తించిందని చెప్పారు. తాము ఏఐ వద్దు అనడం లేదు.. కానీ అది ఎలా ఉండాలో ప్రపంచానికి దిశానిర్దేశం చేస్తున్నాము అని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రకృతి వనరులను ముఖ్యంగా నీరు, విద్యుత్తును హరిస్తూ ఏఐని నిర్మించడం కాక పునరుత్పాదక ఇంధనం, బాధ్యతాయుతమైన వనరుల నిర్వహణతో తెలంగాణ ఏఐకి కేరాఫ్ అడ్రస్‌గా మారుతోందని పేర్కొన్నారు. పెట్టుబడులను ఆహ్వానించడంలో దూకుడుగా ఉన్నప్పటికీ అది పర్యావరణానికి, స్థానిక ప్రజలకు మేలు చేసే విధంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. 'కేవలం భూమి, నీరు, విద్యుత్ ఇచ్చి చేతులు దులుపుకునే పద్ధతి కాకుండా పరిశ్రమలు స్థానిక నైపుణ్యాలను పెంపొందించాలి.. స్వచ్ఛమైన ఇంధనాన్ని వాడాలి.. రీసైకిల్ చేసిన నీటిని మాత్రమే వినియోగించాలి.. ఇది కేవలం ఇంజనీరింగ్ మెరుగుదల కాదు, ఇది మన విలువలకు నిదర్శనం' అని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా కార్బన్ క్రెడిట్స్ గురించి చర్చిస్తున్న సమయంలో తెలంగాణ 'పీపుల్స్ క్రెడిట' అనే కొత్త భావనను తెరపైకి తెచ్చిందని వెల్లడించారు. ఏఐ పెట్టుబడులు కేవలం డేటా సెంటర్లకే పరిమితం కాకుండా స్థానిక ఉపాధిని పెంపొందించడం, గ్రామీణ యువతకు నైపుణ్యాలను అందించడం వంటి అంశాలకు ప్రాధాన్యతనివ్వాలని ప్రభుత్వం నిర్దేశిస్తున్నదని అన్నారు. పెట్టుబడులు రావాలి.. కానీ అవి స్వచ్ఛమైన ఇంధనంతో, పారదర్శకతతో, ప్రజల పట్ల గౌరవంతో రావాలని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కంపెనీలు కేవలం ఉద్గారాలను తగ్గించడమే కాకుండా స్థానిక మేధో సంపత్తిని మెరుగుపరిచే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు.

**రైతులకు, సామాన్యులకు భరోసా:**

వ్యవసాయానికి, సామాన్యులకు దక్కాల్సిన నీటితో సాంకేతికత ఎప్పుడూ పోటీ పడకూడదని భట్టి నొక్కి చెప్పారు. నీటి వినియోగంలో అత్యంత బాధ్యతాయుతమైన విధానాలను అనుసరిస్తున్న ఏఐ వ్యవస్థలకే తెలంగాణ ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. ఏఐ సామాన్య ప్రజలకు కూడా అందుబాటులో ఉండాలని, భాషా అడ్డంకులను తొలగించి, మహబూబాబాద్ నుంచి ఆదిలాబాద్ వరకు ఉన్న గ్రామీణ యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రకటించారు. నెహ్రూ నుంచి మన్మోహన్ సింగ్ వరకు దేశం అనుసరించిన శాస్త్ర, సాంకేతిక వృద్ధి పథాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ మరింత ముందుకు తీసుకెళ్తోందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. తెలంగాణ అంటే కేవలం డేటా సెంటర్ల కేంద్రం మాత్రమే కాదు.. ఆ డేటా సెంటర్లు ఎలా నిర్మించాలో ప్రపంచానికి నేర్పే 'రోల్ మోడల' అని గర్వంగా ప్రకటించారు. పరిశ్రమలకు స్వాగతం పలుకుతూనే 'ప్రజల పక్షపాతి'గా ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు, భవిష్యత్తులో ప్రపంచ ఏఐ ప్రమాణాలను హైదరాబాద్ నిర్ణయించే స్థాయికి తీసుకువెళ్తాయన్నారు. పరిశ్రమలకు ప్రభుత్వం కల్పిస్తున్న అద్భుతమైన వాతావరణం, పారదర్శకమైన పాలన, మానవీయ విలువలతో కూడిన అభివృద్ధి విధానాలు పెట్టుబడిదారులకు గొప్ప భరోసానిస్తున్నాయన్నారు. రాబోయే రోజుల్లో ఏఐ మేధస్సుతోపాటు, మానవీయ వివేకం కూడా కలిగిన సంస్థలే ప్రపంచాన్ని ఏలుతాయని, ఆ దిశగా తెలంగాణ అడుగులు వేస్తోందని వివరించారు. కార్యక్రమంలో ఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్ కూఆ పాల్గొన్నారు.

# రెవెన్యూ శాఖ బలోపేతమే లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి**

ప్రభుత్వం వేగవంతం చేస్తోందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. భవనాల నిర్మాణాలపై అధికారులతో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలి విడతలో అద్దె భవనాలు, శిథిలావస్థలో ఉన్న 107 తహసీల్దార్ కార్యాలయాలు, 10 ఆర్డీవో కార్యాలయాలకు రూ.263 కోట్లతో, అలాగే స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి రూ.97 కోట్లతో 48 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలు, నిజామాబాద్, వరంగల్ జిల్లాల్లో డీఐజీ కార్యాలయాలను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ఈ మొత్తం భవనాల కోసం రెండు విభాగాలకు సంబంధించి రూ.360 కోట్లతో పరిపాలనా అనుమతులు జారీ చేసినట్లు తెలిపారు. ఈ భవనాలన్నీ ఒకే నమూనాలో, ఆధునిక సౌకర్యాలతో ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించేలా రూపొందిస్తామని ఆయన చెప్పారు. వీటి నిర్మాణ బాధ్యతను హౌసింగ్ కార్పొరేషన్‌కు అప్పగించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు కొనసాగడం వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఈ చర్యలు చేపడుతున్నామని మంత్రి పొంగులేటి తెలిపారు. హౌసింగ్ అధికారులు జిల్లాస్థాయిలో రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకుని కొత్త భవనాల నిర్మాణానికి అవసరమైన స్థలాలను గుర్తించి నిర్మాణ పనులను వేగంగా ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ, రిజిస్ట్రేషన్ సేవలందించే కార్యాలయాలు ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండేలా, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నిర్మితమవుతాయని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 13 క్లస్టర్లుగా విభజించి ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండా ప్రైవేటు సంస్థలతో నిర్మిస్తున్నామని తెలిపారు. అయిదేళ్ల నిర్వహణ బాధ్యతను కూడా ఆ సంస్థలే తీసుకున్నాయని, ఇప్పటికే నాలుగు ప్రాంతాల్లో ఇంటిగ్రేటెడ్ భవనాలకు శంకుస్థాపన చేయగా నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయని మంత్రి పొంగులేటి చెప్పారు.

# తాగునీటి సమస్య రానివ్వం: మంత్రి సీతక్క

హైదరాబాద్, జూలై 7

రాష్ట్రంలో వర్షాలు ఆలస్యమైనా, ఎల్‌నినో ప్రభావం ఉన్నా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క స్పష్టం చేశారు. తెలంగాణ తాగునీటి సరఫరా సంస్థ బోర్డు సమావేశంలో గ్రామీణ ప్రాంతాలకు తాగునీటి సరఫరా, జలాశయాల్లో నీటి నిల్వలు, రానున్న నెలల అవసరాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.



**ముందస్తు ప్రణాళికతో చర్యలు**

ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించడం ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యమని మంత్రి పేర్కొన్నారు. వర్షపాతం తగ్గినా, వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నా ముందస్తు ప్రణాళికతో పనిచేసి ఎక్కడా తాగునీటి కొరత తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామానికి నిరంతరాయంగా తాగునీరు అందేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

**జలాశయాలపై నిత్య పర్యవేక్షణ**

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలకు కృష్ణా, గోదావరి పరివాహక ప్రాంతాల జలాశయాల నుంచి 123 నీటి శుద్ధి కేంద్రాల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నట్లు అధికారులు సమావేశంలో వివరించారు. తాగునీటి కోసం వినియోగిస్తున్న 29 జలాశయాల్లో 45, 90, 180 రోజుల అవసరాలకు సరిపడా నీటి లభ్యతపై మంత్రి సమీక్షించారు. జలాశయాల నీటి మట్టాలను ప్రతిరోజూ పరిశీలిస్తూ నీటిపారుదల శాఖతో సమన్వయం కొనసాగించాలని ఆదేశించారు.

**ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి**

జూలై నెలాఖరు వరకు తగిన నీటి ప్రవాహం లేకపోతే అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి ఉదయసముద్రానికి, తుపాకులగూడెం బ్యారేజ్ నుంచి దుమ్ముగూడెంకు నీటిని విడుదల చేసే అంశంపై నీటిపారుదల శాఖతో సమన్వయం చేసుకోవాలని మంత్రి సూచించారు. అలాగే అవసరమైతే ప్రత్యామ్నాయ నీటి వనరులను వినియోగించేలా ముందస్తు ఏర్పాట్లు సిద్ధం చేయాలని చెప్పారు.సింగూర్ ప్రాజెక్టులో నీటి నిల్వలు తగ్గిన నేపథ్యంలో సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తాగునీటి సమస్య తలెత్తే అవకాశంపై కూడా సమావేశంలో చర్చించారు. అవసరమైతే కొత్త బోర్‌వెల్‌లు తవ్వడం, పాత బోర్‌వెల్‌లను పునరుద్ధరించడం, అద్దె బోర్‌వెల్‌లను వినియోగించడం వంటి చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఎలాంటి తాగునీటి సంక్షోభం తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ముందస్తు చర్యలను కచ్చితంగా అమలు చేయాలని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

# మొబైల్ అంగన్వాడి కేంద్రాలకు శ్రీకారం

హైదరాబాద్, జూలై 7

రాష్ట్రంలోని ప్రతి చిన్నారికి అంగన్వాడి సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం మొబైల్ అంగన్వాడి కేంద్రాలను ప్రారంభించింది. ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, కార్మిక శాఖ మంత్రి వివేక్ కలిసి మొబైల్ అంగన్వాడి వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. తొలి దశలో ఈ వాహనం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ఇందిరమ్మ కాలనీలో సేవలు అందించనుంది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ చిన్నారులే దేశ సంపద, భావితరాలకు పునాదని అన్నారు. తెలంగాణ-2047 లక్ష్యాల సాధనలో నేటి చిన్నారుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. అంగన్వాడి కేంద్రాలు అందుబాటులో లేని ప్రాంతాల్లో నివసించే చిన్నారులు కూడా ప్రభుత్వ సేవలకు దూరం కాకూడదనే ఉద్దేశంతో మొబైల్ అంగన్వాడి కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. వలస కార్మికుల పిల్లలకు పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, ప్రీస్కూల్ విద్య, తల్లి-శిశు సంక్షేమ సేవలు అందించేందుకు ఈ కేంద్రాలు ఉపయోగపడతాయని మంత్రి వివరించారు. ఉపాధి కోసం హైదరాబాద్ వంటి నగరాలకు వచ్చే కుటుంబాల చిన్నారులు అంగన్వాడి సేవలు కోల్పోకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. మొబైల్ అంగన్వాడి కేంద్రాల్లో సాధారణ అంగన్వాడి కేంద్రాల్లో అందించే అన్ని సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. పోషకాహారం, ఆరోగ్య పరీక్షలు, ఎదుగుదల పర్యవేక్షణ, ప్రీస్కూల్ విద్యతో పాటు తల్లి-శిశు సంక్షేమానికి సంబంధించిన సేవలను నేరుగా ప్రజల వద్దకే తీసుకెళ్తామని చెప్పారు. ఒక్కో మొబైల్ అంగన్వాడి వాహనం దాదాపు పది అంగన్వాడి కేంద్రాలకు సమానంగా సేవలు అందించే సామర్థ్యాన్ని కలిగి ఉందని మంత్రి సీతక్క వెల్లడించారు. ఒక్కో వాహనం ద్వారా సుమారు 300 మంది లబ్ధిదారులకు సేవలు అందనున్నాయని తెలిపారు. ప్రభుత్వం సేవలను ప్రజల వద్దకే తీసుకెళ్లే దిశగా ఈ కార్యక్రమాన్ని రూపొందించిందన్నారు. చిన్నారి చిరునవ్వే నిజమైన అభివృద్ధికి ప్రతీక అని పేర్కొన్న మంత్రి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ప్రతి చిన్నారి సమగ్ర అభివృద్ధికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ, కార్మిక శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# గురుకులాలు, హాస్టళ్లలో క్లీన్ అండ్ గ్రీన్‌కు ప్రాధాన్యం

- మెనూ అమలులో రాజీ ఉండొద్దు
- బీసీ స్టడీ సర్కిల్స్ బలోపేతానికి ప్రత్యేక కమిటీ
- 16 నుంచి కులవృత్తుల మేళా
- సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం

హైదరాబాద్, జూలై 7 :

గురుకులాలు, హాస్టళ్లు ప్రారంభమై 20 రోజులు పూర్తైన నేపథ్యంలో గత సమీక్షా సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై బీసీ సంక్షేమ శాఖకు సంబంధించిన కార్యక్రమాలపై సచివాలయంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గురుకులాలు, హాస్టళ్లు పరిశుభ్రంగా, పచ్చదనంతో కూడిన క్లీన్ అండ్ గ్రీన్ వాతావరణంలో ఉండేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన మెనూను అన్ని గురుకులాలు, హాస్టళ్లలో తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు.జిల్లా బీసీ సంక్షేమ అధికారులు (డీబీసీవోలు) క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ విద్యార్థుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు తరచూ గురుకులాలు, హాస్టళ్లను సందర్శించి విద్యార్థుల పరిస్థితులను స్వయంగా పరిశీలించాలని సూచించారు.స్టడీ సర్కిల్స్‌లో మరింత నాణ్యత పెంపొందించేందుకు, సివిల్స్‌తో పాటు వృత్తి శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. ఢిల్లీ, అహ్మదాబాద్ వంటి ఇతర రాష్ట్రాల్లో విజయవంతంగా అమలవుతున్న స్టడీ సర్కిల్స్ విధానాలను అధ్యయనం చేసి రాష్ట్రంలో అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.జూలై 16 నుంచి హెచఎండీఏ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న కుల వృత్తుల మేళాలో అన్ని కులాల సంప్రదాయ వృత్తిదారులకు సమాన అవకాశాలు కల్పించాలని సూచించారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు తోడ్పడే కుట్టు మిషన్ పథకం అమలు కోసం సమగ్ర విధి విధానాలను రూపొందించాలని ఆదేశించారు.బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టి ఉపాధి అవకాశాలను పెంచాలని, ఎకనామిక్ సపోర్ట్ స్కీమ్స్‌పై సమగ్ర అధ్యయనం చేసి అమలుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.ఐఐటీలు, ఐఐఎంలలో సీట్లు సాధించిన గురుకుల విద్యార్థులకు అందించే ల్యాప్‌టాప్‌ల పంపిణీపై సమగ్ర నివేదిక సమర్పించాలని మంత్రి ఆదేశించారు. బీసీ సంక్షేమ శాఖ కమిషనర్, గురుకులాల కార్యదర్శి ఆకస్మికంగా గురుకులాలు, హాస్టళ్లను తనిఖీ చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన సౌకర్యాలు అందుతున్నాయో లేదో నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కాటమయ్య రక్షణ కవచాల శిక్షణ పూర్తి చేసుకొని కిట్లు అందని జిల్లాల్లో వెంటనే పంపిణీ పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాలమయదేవి, గురుకులాల కార్యదర్శి సైదులు, బీసీ సంక్షేమ శాఖ అధికారులు మల్లయ్య బట్టు, అలోక్ కుమార్, మామిడి హరికృష్ణ, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# పట్నం, మేడ్చల్, మహేశ్వరంలకు మహర్దశ

మొదటిపేజీ తరువాయి

మంగళవారం శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన సభలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, ఇబ్రహీంపట్నం ప్రజలు, కార్యకర్తలు, నాయకులు తనపై ఉంచిన విశ్వాసం వల్లే రాష్ట్రంలో కీలకమైన రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా సేవ చేసే అవకాశం లభించిందన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం తన బాధ్యత అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఇప్పటికే రూ.85 కోట్ల విలువైన రహదారి పనులు పూర్తి చేశామని, మరో రూ.275 కోట్లతో పలు రహదారి అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. అదనంగా రూ.100 కోట్ల విలువైన కొత్త రహదారి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, జాతీయ రహదారుల విస్తరణ, వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తూ రాష్ట్రాన్నిమరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఎంపీచామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.338 కోట్లతో 140కు పైగా రహదారి పనులు చేపట్టినట్లు తెలిపారు. గ్రామాలు, బస్తీల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్య, వైద్యం, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిందని, ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌గా తీర్చిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు. లక్ష్మీరెడ్డి పాలెం వద్ద ఫ్లైఓవర్, అండర్‌పాస్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గానికి రూ.338 కోట్ల విలువైన రహదారి పనులు మంజూరు కావడం చరిత్రాత్మకమని పేర్కొన్నారు. ఇందులో సుమారు రూ.275 కోట్ల పనులు నేరుగా ఇబ్రహీంపట్నం పరిధిలో చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గంలో 200 పడకల ఆసుపత్రి, ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణ, రహదారుల విస్తరణ వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. అలాగే రూ.2,300 కోట్లతో సమీకృత మార్కెట్ ఏర్పాటు ద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమంతోపాటు అభివృద్ధికి కూడా సమాన ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్లు, భవనాల శాఖ ద్వారా భారీ స్థాయిలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రధాన రహదారులను నాలుగు లేన్లుగా అభివృద్ధి చేయడం ద్వారా రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతోపాటు ఉపాధి, పెట్టుబడులు, ప్రాంతీయ అభివృద్ధికి ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జాయింట్ కలెక్టర్ చంద్రారెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

**హ్యామ్ రోడ్ల నిర్మాణంతో మారనున్న రూపురేఖలు**

హైదరాబాద్ : రాష్ట్ర రహదారుల నెట్‌వర్క్‌ను గతంలో ఎప్పుడూ లేనంతగా అత్యద్భుతంగా అభివృద్ధి చేయబోతున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటించారు. హ్యామ్ రోడ్లకు ఇటీవల సిఎం శంకుస్థాపన చేయడంతో రాష్ట్రంలో రోడ్ల స్వరూపం మారబోతోందన్నారు. ఈ ప్రాంత ప్రజలతో తనకు ప్రత్యేకమైన, వెలకట్టలేని అనుబంధం ఉందని, గతంలో ప్రజలు తమ సొంత డబ్బులు ఖర్చు పెట్టుకొని మరి తనను ఎంపీగా గెలిపించారని ఆయన కృతజ్ఞతతో గుర్తుచేసుకు న్నారు. ఈ ప్రాంత బిడ్డగా ఇక్కడి సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందని, అందుకే రోడ్ల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ శ్రీకారం చుట్టామని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల రూపురేఖల ను మార్చేందుకు ప్రభుత్వం భారీ ప్రణాళికతో ముందుకు వెళ్తోందని మంత్రి వివరించారు. మొత్తం రూ. 13,000 కోట్ల భారీ వ్యయంతో, 34 ప్యాకేజీల కింద, 6,092 కిలోటర్ల మేర విస్తరించిన 441 రోడ్లను హ్యామ్ విధానంలో నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల నల్లగొండ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల దుగా ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించుకున్నామని ఆయన గుర్తుచేశారు. ప్రమాదాలు లేని క్వాలిటీ రోడ్లుగా వీటిని తీర్చిదిద్దుతామని, రోడ్లు రద్దీగా ఉండే హైదరాబాద్ రూరల్ సర్కిల్ 1 / 2 ప్యాకేజీల్లోనే దాదాపు 30 రోడ్లను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో భాగంగా తాజాగా రూ. 338 కోట్ల వ్యయంతో 149 కిలోటర్ల మేర విస్తరించే 14 రహదారుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకున్నట్లు మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా ఈ ప్రాంత ప్రజల మనిషిగా అద్దం లాంటి రహదారులను నిర్మించి తీరుతామని, ఈ రోడ్ల కనెక్టివిటీ ద్వారా రాబోయే రోజుల్లో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మరింతగా పెరుగుతాయని మంత్రి భరోసా ఇచ్చారు.

## అహ్మదాబాద్ పేలుళ్ల కేసులో ..
# 38 మందికి ఉరిశిక్ష

మొదటిపేజీ తరువాయి

కోర్టు 49 మందిని దోషులుగా నిర్ధారించింది. వారిలో 38 మందికి మరణశిక్ష, 11 మందికి యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. సాక్ష్యాధారాలు లభించకపోవడంతో 28 మందిని నిర్దోషులుగా విడుదల చేసింది. ఒకేసారి 38 మందికి మరణశిక్ష విధించడం భారత న్యాయ చరిత్రలో అరుదైన ఘటనగా నమోదైంది.

**వేలాది పేజీల ఆధారాలతో తీర్పు**

ఈ కేసు విచారణలో 1,150 మందికి పైగా సాక్షుల వాంగ్మూలాలు నమోదు చేశారు. అనంతరం ప్రత్యేక న్యాయస్థానం 6,700 పేజీలకు పైగా ఉన్న తీర్పును వెలువరించింది. దీనిపై దోషులు హైకోర్టును ఆశ్రయించగా, అన్ని వాదనలు పరిశీలించిన గుజరాత్ హైకోర్టు ప్రత్యేక కోర్టు తీర్పును సమర్థించింది. పేలుళ్లలో మరణించిన 56 మంది కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 లక్షలు, గాయపడిన 200 మందికి పైగా బాధితులకు ఒక్కొక్కరికి రూ.1 లక్ష చొప్పున పరిహారం అందించాలని కూడా ఆదేశించింది. ఈ తీర్పు ఉగ్రవాద కేసుల విచారణలో మరో కీలక మైలురాయిగా నిలిచింది.

# బిఎల్‌వోలను బెదిరిస్తున్న ఎంఐఎం

- సిఈవోకు ఫిర్యాదు చేసిన బీజేపీ నేతలు

హైదరాబాద్,జూలై 7:



సర్ ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సీఈవోను బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు కోరారు. ఆయన ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని ఆ పార్టీ బృందం కలిసింది. ఈ సందర్భంగా సర్ విషయంలో ఎంఐఎం పార్టీ వ్యవహరిస్తున్న తీరు సరిగ్గా లేదని రాంచందర్ రావు ఫిర్యాదు చేశారు. అనంతరం బీజేపీ తెలంగాణ చీఫ్ మీడియాతో మాట్లాడుతూ.. పలు ప్రాంతాల్లో బీఎల్‌వోలను ఎంఐఎం, కాంగ్రెస్ నేతలు బెదిరిస్తున్నారని తెలిపారు. ఇంటింటికీ వెళ్లకుండా బీఎల్‌ఓలను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. పలువురు ఓటర్లకు ఫారాలు అందడం లేదని రాంచందర్ రావు తెలిపారు. తెలుగు ఫారాలతో ఇతర రాష్ట్రాల ఓటర్లకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. హైదరాబాదే కాకుండా అవసరమైన అన్ని ప్రాంతాల్లో ఇంగ్లీషు ఫారాలు అందించాలని కోరినట్లు తెలిపారు. ఓటర్ల జాబితా లోపాలపై చర్యలు తీసుకోవాలని సీఈవోను కోరినట్లు రాంచందర్‌రావు పేర్కొన్నారు.ఈ బృందంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయశ్రీ, సీనియర్ నాయకులు ఆంథోని రెడ్డి, సోల్కర్ తదితరులు ఉన్నారు

**జీహెచ్‌ఎంసీ మేయర్ పీఠమే లక్ష్యం కావాలి**

రానున్న జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో మేయర్ పీఠాన్ని బీజేపీ కైవసం చేసుకోవడమే లక్ష్యమని, ఇందుకోసం ప్రతి కార్యకర్త విజయమే ఏకైక లక్ష్యంగా ఐక్యంగా పనిచేయాలని రామచందర్ రావు పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ , కాంగ్రెస్ పాలనకు విసిగిపోయిన ప్రజలు బీజేపీ వైపు ఆశగా చూస్తున్నారన్నారు. బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలో పార్టీకి బలమైన కేడర్, ప్రజల ఆదరణ ఉన్నాయని, ఈ జిల్లాలో విజయం సాధించడానికి అనుకూల పరిస్థితులు ఉన్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో సాధించిన విజయాలను స్ఫూర్తిగా తీసుకుని రానున్న జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో 100% ఫలితాలు సాధించి మేయర్ పీఠాన్ని కైవసం చేసుకోవడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. ద్వితీయ, తృతీయ స్థానాల గురించి కాక కేవలం విజయాన్నే లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. మున్సిపల్ ఎన్నికల తర్వాత జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు రానున్నాయని, అందరికీ భవిష్యత్తులో అవకాశాలు ఉంటాయని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై, అవినీతిపై బూత్, మండల స్థాయి నుంచి బలమైన ఉద్యమాలను నిర్మించాలని కేడర్‌కు పిలుపునిచ్చారు. జిల్లావ్యాప్తంగా స్థానిక సమస్యలను గుర్తించి నిరంతర పోరాటాలు చేయాలన్నారు. మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ సైబరాబాద్ మున్సిపాలిటీ మీద ఎగిరేది కాషాయ జెండానే అని అన్నారు. తాను ఎంపీగా గెలిచిన తరువాత ఎల్బీనగర్ నియోజకవర్గం కార్పొరేటర్లకు రూ.కోట్ల నిధులు వచ్చాయని, ఇక్కడి కార్పొరేటర్లు తమ వంటి వారి అవసరం లేకుండానే ప్రజల పనులు చేసిపెట్టగల సత్తా సంతరించుకున్నారని తెలిపారు. మాటల గారడి చేసి గెలిచిన రేవంత్ రెడ్డి రెండేళ్లకే వెలకిల పడ్డాడని ఎద్దేవా చేశారు. ఈ పార్టీ మళ్లీ గెలవదు అని మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులే అంటున్నారని, దీపం ఉన్నప్పుడే చక్క పెట్టుకోవాలని చూస్తున్నారని వ్యాఖ్యానించారు. నాయకుడు పార్టీకి భారం కాకూడదు. కార్యకర్తలు, ప్రజలే మన వీఐపీలు. మొన్న మమ్మల్ని గెలిపించారు.. నేడు మిమ్మల్ని గెలిపించడంలో మా శాయశక్తులా కృషి చేస్తాం అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సంఘటన మంత్రి చంద్రశేఖర్ జీ, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు, జాతీయ నాయకుడు పేరాల శేఖర్ జీ, రాష్ట్ర అధికార ప్రతినిధులు ప్రభా గౌడ్, రవికుమార్ యాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నుకుల పద్మారెడ్డి, బండారు శైలజ, శ్రీదేవి రెడ్డి, కాలేం రవీందర్, కొత్త రవీందర్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు బండారు భాస్కర్, యశ్‌పాల్ గౌడ్, లింగోజిగూడ డివిజన్ అధ్యక్షుడు గుండె కిరణ్ కుమార్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి, కార్పొరేటర్లు నవంజీవన్ రెడ్డి, లచ్చిరెడ్డి, ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి, రంగా నర్సింహ గుప్తా, జిల్లా కార్యవర్గ సభ్యులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అక్రమ సంబంధం కోసం భర్త హత్య..

- మిస్సింగ్ కేసుగా మభ్యపెట్టిన భార్య

హైదరాబాద్, జూలై 7

హైదరాబాద్‌లోని మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే కారణంతో ఓ మహిళ తన ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం శవాన్ని మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతానికి తరలించి పూడ్చిపెట్టి, భర్త కనిపించడం లేదంటూ మిస్సింగ్ ఫిర్యాదు చేసి పోలీసులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసినట్లు దర్యాప్తులో తేలింది.

గత ఏడాది నవంబర్‌లో భర్త కనిపించడం లేదని మహిళ ఫిర్యాదు చేయడంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా మహిళ కాల్ డేటా వివరాలు, సీసీటీవీ దృశ్యాలను పరిశీలించగా పలు అనుమానాస్పద అంశాలు వెలుగులోకి వచ్చాయి.

**లోతైన దర్యాప్తులో అసలు విషయం**

సాంకేతిక ఆధారాలను పరిశీలించిన పోలీసులు మహిళను విచారించగా, ఆమె తన ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసినట్లు గుర్తించారు. నేరం బయటపడకుండా ఉండేందుకు మృతదేహాన్ని వాహనంలో మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతానికి తీసుకెళ్లి గుట్టుచప్పుడు కాకుండా పూడ్చిపెట్టినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

**మహారాష్ట్రలో మృతదేహం వెలికితీత**

ఈ కేసులో నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు, మహారాష్ట్ర పోలీసుల సహకారంతో నిందితులు చూపించిన ప్రాంతంలో మృతదేహాన్ని వెలికితీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, హత్యకు దారితీసిన పరిస్థితులపై పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు.







# ఘనంగా మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు

## ఉత్సాహంగా ఎంఆర్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్ :** మాదాపూర్ సిద్దిక్‌నగర్‌లో అంజయ్య మాదిగ ఆధ్వర్యంలో ఎంఆర్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం, వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ముందుగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంఆర్పీఎస్ జెండాను ఆవిష్కరించి, మందకృష్ణ మాదిగ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. 1994లో ప్రారంభమైన దండోరా ఉద్యమం నేడు దేశ వ్యాప్తంగా విస్తరించిందని నాయకులు పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్ల కోసం నిరంతరం పోరాడి విజయం సాధించడంతో పాటు, ఇటీవల పద్మశ్రీ పురస్కారం అందుకున్న మందకృష్ణకు కృతజ్ఞతలు తెలుపుతూ ఈ వేడుకలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ నాయకులు కుమ్మరి సత్యనారాయణ, జిల్లా నాయకులు ఐతా రమేష్, శేరిలింగంపల్లి మండల అధ్యక్షుడు గణేష్, మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మి, సిద్దిక్‌నగర్ ప్రెసిడెంట్ నందు, బసవరాజ్, రాము, నరేష్, కోడిచర్ల ప్రేమ్ కుమార్, సరోజా మాదిగ, యాదమ్మ, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య కేంద్రంలో ఘనంగా ఆశా దినోత్సవ నిర్వహణ

డాక్టర్ సురేష్



**రామారెడ్డి రాజముద్ర న్యూస్:** రామారెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు వైద్యాధికారి డా. ఎం. సురేష్ తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కార్యక్రమాధికారులు డా. మౌనిక, పద్మజ, రామారెడ్డి పీహెచ్‌సీని సందర్శించి, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల అమలు, గ్రామీణ స్థాయిలో అందిస్తున్న సేవలు, తల్లి–శిశు సంరక్షణ, అంటువ్యాధుల నివారణ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో వర్షాకాలంలో ప్రబలే వ్యాధులను దృష్టిలో ఉంచుకొని ప్రతి గ్రామంలో జ్వర సర్వే , విరేచనాల సర్వే ను సమర్థవంతంగా నిర్వహించాలని ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలకు ప్రత్యేక శిక్షణ అవగాహన కల్పించారు. జ్వరం, విరేచనాలతో బాధపడుతున్న వారిని వెంటనే గుర్తించి సమీప ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రసవం అనంతరం శిశువుకు మొదటి గంటలోనే తల్లి పాలు ఇవ్వడం తప్పనిసరి అని తెలిపారు. పుట్టిన శిశువులకు మొదటి ఆరు నెలల పాటు తల్లి పాలు మాత్రమే ఇవ్వాలని బాలింతలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.తక్కువ బరువుతో పుట్టిన శిశువులకు కంగారూ మదర్ కేర్ పద్ధతిని తప్పనిసరిగా పాటించి శిశువుల ఆరోగ్యాన్ని మెరుగుపరచాలని వివరించారు.శిశువుల ఎదుగుదలలో ప్రతి ★అభివృద్ధి మైలురాయిను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ, ఏవైనా పుట్టుకతో వచ్చే లోపాలు ఉన్నట్లయితే వెంటనే గుర్తించి ఉన్నత వైద్య సేవలకు రిఫర్ చేయాలని సూచించారు.శిశు మరణాల రేటును తగ్గించేందుకు గర్భిణులు, బాలింతలు, శిశువులకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలని, ఇంటింటి సందర్శనలు క్రమం తప్పకుండా నిర్వహించాలని ఆశా కార్యకర్తలకు సూచించారు.వర్షాకాలంలో దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించేందుకు ప్రతి శుక్రవారం "డ్రై డే – ఫ్రైడే" కార్యక్రమాలను తప్పనిసరిగా నిర్వహించాలని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా ప్రజలను చైతన్యపరచాలని తెలిపారు.అలాగే మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణ చర్యలు, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణ చర్యలపై గ్రామీణ ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సంజు జార్జ్, నేత్ర వైద్యాధికారి హరికిషన్, హెల్త్ సూపర్వైజర్ రాజమణి, ఆశా నోడల్ అధికారి రుక్మిణి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు మరియు పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

# జూలై 10 రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలి

**విద్యాసంస్థల బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎస్ఎఫ్ఐ నాయకులు**




**మొయినాబాద్, రాజముద్ర న్యూస్:** విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల జూలై 10న నిర్వహించనున్న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ మొయినాబాద్ మండల కమిటీ ఆధ్వర్యంలో బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మొయినాబాద్ మండల అధ్యక్షుడు రేశ్వంత్, మండల కార్యదర్శి గోటూరి చరణ్ గౌడ్ మాట్లాడుతూ...రాష్ట్రంలోని విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని, విద్యార్థుల హక్కులను పరిరక్షించాలని, విద్యను వ్యాపారంగా మార్చే విధానాలకు స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు. జూలై 10న జరిగే విద్యాసంస్థల బంద్‌కు విద్యార్థులు, యువజనులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున మద్దతు తెలిపి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

**బంద్ ప్రధాన డిమాండ్లు:**

- 27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేలకే పరిమితం చేయాలనే ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలి.
- ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రెండు జతల యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలను సకాలంలో అందించాలి. మధ్యాహ్న
- భోజన పథకానికి నిధులు పెంచి, అక్షయపాత్ర, ఇస్కాన్, మన్నా వంటి సంస్థలకు కాకుండా మహిళా సంఘాల ద్వారా అమలు చేయాలి. ఖాళీగా ఉన్న
- ఉపాధ్యాయ, ఎంఈఓ, డీఈవో, లెక్చరర్ల పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా
- వ్యాపారాన్ని అరికట్టి ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి. విద్య హక్కు
- చట్టం (ఆర్ టి ఈ)ను పూర్తి స్థాయిలో అమలు చేసి, పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత ప్రవేశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్
- విద్యాసంస్థల్లో పుస్తకాలు, యూనిఫారాలు, నోట్‌బుక్స్ బలవంతపు విక్రయాలను నిలిపివేయాలి. పెండింగ్
- స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసి జి.ఓ. నెం. 7, 8, 9లను రద్దు చేయాలి. ఇంటర్మీడియట్
- కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని వెంటనే ప్రారంభించి తగిన నిధులు కేటాయించాలి.
- అద్దె భవనాల్లో కొనసాగుతున్న పాఠశాలలు, హాస్టళ్లు, గురుకులాలకు శాశ్వత భవనాలు నిర్మించాలి. ప్రతి
- పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్‌లు, ఆధునిక తరగతి గదులు ఏర్పాటు చేయాలి.
- విద్యార్థులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించి, బడి బస్సులు నడపడంతో పాటు ఉచిత బస్‌పాస్‌లు ఇవ్వాలన్నారు. పెరిగిన
- ధరలకు అనుగుణంగా మెస్, కాస్మెటిక్ ఛార్జీలను పెంచి పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని కోరారు. ప్రతి
- పాఠశాలలో విద్యుత్, ఇంటర్నెట్, తాగునీరు, వంటశాలలు, మరుగుదొడ్ల వంటి మౌలిక వసతులు కల్పించాలి. ఎన్ఎస్పి –2020ను తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయకుండా అసెంబ్లీలో తీర్మానం చేయాలి.
- బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద పెండింగ్‌లో ఉన్న రూ.250 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలి. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మొయినాబాద్ మండల నాయకులు వినోద్, ప్రణవ్, నితీశ్, ప్రవీణ్, నవీన్, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు

**రామారెడ్డి, జూన్ 7 రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 32వ ఆవిర్భవ దినోత్సవం మందకృష్ణ మాదిగ జన్మదిన కార్యక్రమాలను ఉప్పల్ వాయి, మోషన్ పూర్, పోసాని పేట్, గిద్ద, రామారెడ్డి, కన్నాపూర్, గ్రామంలో ఘనంగా జరుపుకోవడం జరిగింది, అలాగే జెండా ఎగురవేసి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు, ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కోతోల్లా యాదగిరి, రామారెడ్డి ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు ఇనుగుర్తి రాజనర్సయ్య, ఉప్పల్ వాయి గ్రామ సర్పంచ్ శివాని రాజేందర్, ఉప సర్పంచ్ ఆలపర్వారెడ్డి, మాజీ సొసైటీ డైరెక్టర్ కాల హనుమాన్లు, ఒకటో వార్డు మెంబర్ అమీర్, సూరంపల్లి వాసు, పంగ బాబు, దండు కృష్ణ, పంగ బాలవ్వ, సూరంపల్లి శ్యామల, కోతోల్లా మణెమ్మ, కొమ్ము మల్లయ్య, కొమ్ము సత్యవ్వ తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ ఏసీబీ వలలో డీఎస్పీ సంకిరెడ్డి భీమ్ రెడ్డి

### రూ.200 కోట్లకు పైగా అక్రమాస్తుల కేసు



**రాజముద్ర న్యూస్ :** తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ACB) 2026 జూలై 6న పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్ (PCS), హైదరాబాద్‌లో విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ) సంకిరెడ్డి భీమ్ రెడ్డిని అక్రమాస్తుల కేసులో అరెస్ట్ చేసింది. ఏసీబీ అధికారులు జూలై 2 నుంచి తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో మొత్తం 16 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో డీఎస్పీ, ఆయన బంధువులు, స్నేహితులు, బినామీల పేర్లపై ఉన్న ఆస్తులకు సంబంధించిన పత్రాలు, విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

**సోదాల్లో బయటపడిన ముఖ్యమైన ఆస్తులు:** రూ.43.6 లక్షల నగదు (ఇందులో రూ.3.6 లక్షలు ఆయన ఇంటి నుంచి, రూ.40 లక్షలు బంధువు ఇంటి నుంచి స్వాధీనం). సుమారు 2 కిలోల బంగారు ఆభరణాలు. 20 కిలోల వెండి వస్తువులు.

ఇబ్రహీంబాగ్‌లో ఒక విలాసవంతమైన విల్లా, ఒక స్వతంత్ర ఇల్లు. గచ్చిబౌలి, తెల్లాపూర్ వంటి ప్రాంతాల్లో 4 లగ్జరీ అపార్ట్‌మెంట్లు. సంగారెడ్డి, వికారాబాద్, ముచ్చింతల్ ప్రాంతాల్లో 50 ఎకరాలకు పైగా వ్యవసాయ భూమి, అలాగే కర్ణాటకలోని దేవనహళ్లిలో 1 ఎకరం స్థలం. పలు వాణిజ్య స్థలాలు, ఖాళీ ప్లాట్లు, అలాగే మైనింగ్ మరియు రాక్ సాండ్ వ్యాపారంలో రూ.75 లక్షల భాగస్వామ్య పెట్టుబడి. అదనంగా, ఆయన నివాసంలో 23 విదేశీ మద్యం సీసాలు లభించడంతో, ఆ అంశాన్ని ప్రత్యేక చర్యల కోసం రాష్ట్ర ఎక్సైజ్ శాఖకు పంపించారు. ఏసీబీ ప్రాథమిక అంచనా ప్రకారం, ఆయన చట్టబద్ధ ఆదాయానికి మించి రూ.200 కోట్లకు పైగా (కొన్ని తాజా నివేదికల ప్రకారం రూ.300 కోట్ల వరకు) విలువైన ఆస్తులను కూడబెట్టినట్లు గుర్తించింది. ఈ కేసులో ★అవినీతి నిరోధక చట్టం, 1988 (2018 సవరణ)★లోని సెక్షన్ 13(1)(బి), 13(2) కింద కేసు నమోదు చేశారు. అరెస్ట్ అనంతరం ఆయనను హైదరాబాద్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నారు.

# విద్యార్థి సమస్యల పరిష్కారానికి జూలై 10న రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు విద్యార్థి సంఘాల పిలుపు

**హైదరాబాద్, జూలై 7:** రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పలువురు విద్యార్థి సంఘాలు జూలై 10న రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ మేరకు విద్యార్థులకు సంబంధించిన పలు డిమాండ్లతో కూడిన పోస్టర్‌ను విడుదల చేశాయి. విద్యార్థి సంఘాల ప్రధాన డిమాండ్లలో రాష్ట్రంలోని ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయడం, ప్రభుత్వ పాఠశాలలు మరియు విశ్వవిద్యాలయాలకు తగిన నిధులు కేటాయించడం, వసతి గృహాల పరిస్థితులను మెరుగుపరచడం, విద్యార్థులకు నాణ్యమైన భోజనం, తాగునీరు, వైద్య సదుపాయాలు కల్పించడం, స్కాలర్‌షిప్‌లు మరియు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను సకాలంలో విడుదల చేయడం వంటి అంశాలు ఉన్నాయి. అలాగే విశ్వవిద్యాలయాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, ఖాళీగా ఉన్న వైస్ ఛాన్సలర్, అధ్యాపక నియామకాలను త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తూ విద్యార్థులపై ఆర్థిక భారం పెంచే నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ బంద్‌కు రాష్ట్రంలోని ఎస్ఎఫ్ఐ ఏఐఎస్ఎఫ్ పి డి ఎస్ యు ఏఐడీఎస్ఓ ఏఐఎఫ్డీఎస్ ఏఐఎస్బి ఏఐపిఎస్యు తదితర విద్యార్థి సంఘాలు మద్దతు ప్రకటించాయి. విద్యార్థులందరూ బంద్‌ను విజయవంతం చేయాలని సంఘాల నాయకులు పిలుపునిచ్చారు.

# యువతను కబళిస్తున్న డ్రగ్స్ మాఫియా

### విద్యాసంస్థలే లక్ష్యం.. అప్రమత్తతే ఆయుధం

**రాజముద్ర న్యూస్ :** దేశవ్యాప్తంగా యువతను లక్ష్యంగా చేసుకుని మాదకద్రవ్యాల (డ్రగ్స్) మాఫియా తన కార్యకలాపాలను విస్తరిస్తోంది. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల పరిసరాల్లో డ్రగ్స్ విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారం ఆందోళన కలిగిస్తోంది. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో కొందరు యువకులను డ్రగ్స్ రవాణా, విక్రయాల్లో భాగస్వాములను చేస్తుండగా, విద్యార్థులను వినియోగదారులుగా మార్చేందుకు ముఠాలు పన్నాగాలు పన్నుతున్నాయి. ఇటీవల వివిధ రాష్ట్రాల్లో పోలీసులు, నార్కోటిక్స్ అధికారులు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో విద్యాసంస్థల పరిసరాల్లో డ్రగ్స్ సరఫరా నెట్‌వర్కులు వెలుగులోకి రావడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు, ప్రత్యేక నిఘా చర్యలు చేపడుతున్నాయి.

**యువతపై డ్రగ్స్ దుష్ప్రభావం**

డ్రగ్స్ వ్యసనం వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా కుటుంబం, సమాజం, దేశ భవిష్యత్తుపైనా తీవ్ర ప్రభావం చూపుతుంది. మెదడు పనితీరు దెబ్బతిని జ్ఞాపకశక్తి, ఏకాగ్రత తగ్గిపోతాయి. చదువుపై ఆసక్తి కోల్పోయి విద్యలో వెనుకబడే ప్రమాదం ఉంటుంది. ఆందోళన, నిరాశ, కోపం, మానసిక రుగ్మతలు పెరిగే అవకాశం ఉంది. గుండె, కాలేయం, ఊపిరితిత్తులు, నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుంది. కుటుంబ సంబంధాలు దెబ్బతిని సామాజిక ఒంటరితనం ఏర్పడుతుంది. నేరప్రవర్తన, హింసాత్మక చర్యలు, రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే అవకాశం పెరుగుతుంది. డ్రగ్స్ కొనుగోలు కోసం ఆర్థిక ఇబ్బందులు, చట్టపరమైన సమస్యలు ఎదురవుతాయి. దేశ యువశక్తి ఉత్పాదకత తగ్గి సామాజిక, ఆర్థిక అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపుతుంది.

**తల్లిదండ్రులు – ఉపాధ్యాయుల పాత్ర కీలకం**

యువత ప్రవర్తనలో అకస్మాత్తుగా మార్పులు, చదువుపై నిర్లక్ష్యం, కొత్త స్నేహితుల ప్రభావం, డబ్బు ఎక్కువగా ఖర్చు చేయడం వంటి లక్షణాలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గమనించాలి. విద్యార్థులతో స్నేహపూర్వకంగా మాట్లాడి సమస్యలను తెలుసుకోవడం ద్వారా డ్రగ్స్ బారిన పడకుండా కాపాడవచ్చు.

**నివారణకు తీసుకోవాల్సిన చర్యలు**

విద్యాసంస్థల పరిసరాల్లో పోలీసుల నిఘాను మరింత బలోపేతం చేయాలి.
ప్రతి పాఠశాల, కళాశాలలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. విద్యార్థులకు కౌన్సెలింగ్, మానసిక ఆరోగ్య సేవలు అందుబాటులో ఉంచాలి. అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. యువతను క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాల వైపు ప్రోత్సహించాలి. తల్లిదండ్రులు పిల్లలతో నిరంతరం సంభాషిస్తూ వారి మానసిక పరిస్థితిని అర్థం చేసుకోవాలి.

**సమాజం అప్రమత్తమైతేనే నియంత్రణ**

డ్రగ్స్ నిర్మూలన అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదు. ప్రభుత్వం, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, మీడియా, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సమిష్టిగా కృషి చేసినప్పుడే యువతను ఈ మహమ్మారి నుంచి రక్షించగలం. ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించి డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి సహకరించాల్సిన అవసరం ఉంది.డ్రగ్స్ ఒక వ్యక్తి జీవితాన్ని మాత్రమే కాదు... కుటుంబాన్ని, సమాజాన్ని, దేశ భవిష్యత్తును కూడా నాశనం చేస్తాయి. అప్రమత్తత, అవగాహన, సమిష్టి కృషితోనే డ్రగ్స్ రహిత భారతాన్ని నిర్మించగలం."

# నేలకొండపల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఐజీ చంద్రశేఖర్ రెడ్డి

**పెండింగ్ కేసులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచన**



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి పోలీస్ స్టేషన్‌ను మల్టీ జోన్-1 పోలీస్ ఐజీ చంద్రశేఖర్ రెడ్డి మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్‌లోని రికార్డుల నిర్వహణ, కేసుల దర్యాప్తు తీరు, శాంతిభద్రతల పరిస్థితి మరియు ప్రజలకు అందుతున్న పోలీసు సేవలపై సమగ్రంగా సమీక్షించారు.స్టేషన్ సిబ్బందితో మాట్లాడిన ఐజీ.. పెండింగ్‌లో ఉన్న కేసులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించి, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని పోలీసు అధికారులకు సూచించారు.పోలీస్ స్టేషన్‌లోని మౌలిక సదుపాయాలు, రికార్డుల నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించిన ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, సిబ్బంది పనితీరును అభినందించారు. ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచే విధంగా సమర్థవంతంగా పనిచేయాలని డిపార్ట్మెంట్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ పర్యటనలో ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి, నేలకొండపల్లి ఎస్ఐ శ్రీనివాసరెడ్డి, స్టేషన్ పరిధిలోని శాంతిభద్రతల పరిస్థితి, నేర నియంత్రణ చర్యలపై ఐజీకి వివరించారు.కూసుమంచి ఎస్ఐ నాగరాజు, తిరుమలాయపాలెం ఎస్ఐ జగదీష్, కారేపల్లి సీఐ సాగర్, ముదిగొండ సీఐ మురళి, సీఐ సంజు తదితరులు పాల్గొని తమ పరిధిలో అమలు చేస్తున్న పోలీసింగ్ విధానాలను ఐజీకి వివరించారు.

## కొరట్లగూడెంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన బచ్చలకూరి నాగరాజును సన్మానించిన డీజీపీ సీవీ ఆనంద్

**గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు నాయకులు ముందుకు రావాలని పిలుపు**



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** ఖమ్మం పట్టణంలోని పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం కొరట్లగూడెం గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినందుకు ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజును డీజీపీ సీవీ ఆనంద్ శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు, నేర నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో కీలకమని అన్నారు. నాయకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించడం అభినందనీయమని, ఇలాంటి కార్యక్రమాలు ఇతరులకు ఆదర్శమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ★ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్, రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి, కూసుమంచి సీఐ సంజీవ్, ఎస్ఐ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా దొంగతనాలు, ఇతర నేరాలు అరికట్టడంతో పాటు పోలీసు విచారణకు సహాయకారిగా ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

# ఎన్నికలు వద్దు – విలీనం ముద్దు

**రామంతపూర్, 7 జూలై ( టుడేస్ న్యూస్ ):** ఆర్టీసీ ఉద్యోగుల ప్రభుత్వ విలీన యాక్ట్ నెం. 07 ఆఫ్ 2023 అమలు చేస్తూ ఆర్టీసీ ఉద్యోగులను వెంటనే ప్రభుత్వంలో విలీనం చేసి "అపాయింటెడ్ డే" ప్రకటించాలని తేది. 06.07.2026 న సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో ఆర్టీసీ బహుజన వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన అన్ని యూనియన్ల రౌండ్ టేబుల్ సమావేశంలో ఈ క్రింది తీర్మానాలు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ఆర్టీసీలోని అన్ని ట్రేడ్ యూనియన్లు మరియు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ అసోసియేషన్ల ప్రతినిధులు, సీనియర్ నాయకులు హాజరయ్యారు. ఇదే సందర్భంగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడానికి అసెంబ్లీలో బిల్లు ఆమోదం పొంది, గవర్నర్ ఆమోదంతో యాక్ట్ నెం. 07 ఆఫ్ 2023 గా 15-09-2023 న గెజిట్ నోటిఫికేషన్ విడుదలైందని, ఆ చట్టం ప్రకారం ప్రభుత్వం "అపాయింటెడ్ డే"ను ప్రకటించి జీవో ( జీవో ) విడుదల చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు అమలు చేయకుండా యూనియన్ ఎన్నికల వైపు అడుగులు వేయడం చట్ట వ్యతిరేకమని, రాజ్యాంగ విరుద్ధమని అన్ని యూనియన్లు అభిప్రాయపడ్డాయి. అలాగే ప్రస్తుతం ఉన్న జేఏసీ (జాక్ ) తమ అధికారిక అభిప్రాయాన్ని వెల్లడించేందుకు రేపటి వరకు సమయం కోరిన నేపథ్యంలో, 08-07-2026 ఉదయం 10:00 గంటలకు మరో సమావేశాన్ని నిర్వహించాలని, అలాగే ఆర్టీసీలో యూనియన్ ఎన్నికలు నిర్వహించవద్దని కోరుతూ లేబర్ కమిషనర్‌ను కలిసి అన్ని యూనియన్ల సంతకాలతో వినతిపత్రం సమర్పించాలని సమావేశం నిర్ణయించింది.

**ఈ సమావేశంలో పాల్గొన్న యూనియన్లు మరియు అసోసియేషన్లు:**

**బహుజన వర్కర్స్ యూనియన్:** సాజిద్ మహమ్మద్ & సుద్దాల సురేశ్

టీఎంయూ (అశ్వత్థామ రెడ్డి)శంకర్ & నిరంజన్

**స్టాఫ్ & వర్కర్స్ యూనియన్ ఐ ఎన్ టి యు సి :** జక్కుల మల్లేశం గౌడ్ & అబ్రహం

**తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ టీజేఎంయు :**హన్మంత్ ముదిరాజ్ & గోలి రవీందర్

**నేషనల్ మజ్దూర్ యూనియన్ ఎన్ఎంయు :** మర్రి నరేందర్ & కామ్రేడ్ సత్యం.

**ఆర్టీసీ సామాజిక తెలంగాణ మజ్దూర్ యూనియన్ ఎస్ టి ఏం యు:** పున్న హరికిషన్

**ఆర్టీసీ జేఏసీ సంఘాల ప్రతినిధి:** కమలాకర్ గౌడ్


**బీసీ వెల్ ఫేర్ అసోసియేషన్:**సురేష్ & దుర్గేష్ గౌడ్

**ఎస్సీ /ఎస్టీ వెల్ ఫేర్ అసోసియేషన్:** నిరంజన్

**మైనారిటీ వెల్ ఫేర్ అసోసియేషన్:** జనరల్ సెక్రటరీ

# ఇంటింటికి వెళ్లవలసిన బి ఎల్ ఓ లు పంచాయతీకే పరిమితం

- స్కాన్ చేసి ఇవ్వవలసిన ఎన్యూమరేషన్ ఫారాలు పంచాయితీ కార్యాలయంలోనే ఇవ్వడం
- బి ఎల్ ఓ లుగా కొనసాగుతున్న ఫీల్డ్ అసిస్టెంట్లు
- ఇబ్బందుల్లో ఉన్న ఉపాధి హామీ కూలీలు






**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ డిజిటలైజేషన్ కోసం ఇన్యూమరేషన్ ఫారాలు బి ఎల్ ఓ లు ఇంటింటికి వెళ్లి స్కాన్ చేసి ఇవ్వాల్సిన ఫారాలు గ్రామపంచాయతీలోని ఇవ్వడం జరుగుతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎన్యూమరేషన్ ఫారాలు స్కాన్ చేస్తున్నారా లేదా తెలియదు కానీ పంచాయతీ కార్యాలయంలోని ఇవ్వడం జరుగుతుందని వికారాబాద్ జిల్లా పరిధిలోని ఆయా మండలాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఓటర్ల సమగ్ర సవరణ కోసం ఏర్పాటు చేసిన సందర్భంగా బిఎల్ఓ లు ఇంటింటికి వెళ్లకుండా పంచాయతీ కార్యాలయంలోనే పని చేయడం ద్వారా అక్కడే ఉండి కొంత సమయము ఉండవలసి వస్తుందని ఆరోపిస్తున్నారు. ఇన్యూమరేషన్ పారాలు పంచాయతీ కార్యాలయంలోనే ఇవ్వడంతో పాటు తిరిగి తీసుకోవడం కూడా పంచాయతీ కార్యాలయలలోనే తీసుకోవడం జరుగుతుందని జిల్లాలోని ప్రజలు ఆరోపిస్తున్నారు. వికారాబాద్ జిల్లా పరిధిలోని కొన్ని గ్రామపంచాయతీలో ఫీల్డ్ అసిస్టెంట్లు బి ఎల్ ఓ లుగా పనిచేయడం ద్వారా ఉపాధి హామీలో, ఉపాధి హామీ నర్సరీలో పనిచేస్తున్న వారి హాజరు కోసం రెండు ఫోటోలు తీయవలసి ఉండగా ఈ పని చేయడం ద్వారా ఉపాధి హామీ పని చేయడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని సమయాన్నికూలంగా హాజరు వేయడంలో సమస్యలు తలెత్తుతున్నాయని ఆరోపిస్తున్నారు. ఇటు ఉపాధి హామీ పనిచేయలేక అటు బి ఎల్ ఓ లుగా పనిచేయాలంటే పని భారం పెరగటం వల్ల సమయానుకూలంగా హాజరు ఫోటోలో తీయలేకపోతున్నారని కొన్ని గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇంటింటికి వెళ్లవలసిన బి ఎల్ ఓ లు ఓటర్లను తమ వద్దకు తెలుసుకోవడం ఎంతవరకు సరి అయిందో అధికారులే ఆలోచించాలన్నారు. బి ఎల్ ఓ ల పనితీరును పరిశీలించవలసిన సంబంధిత అధికారులు ఈ సంఘటనలను పరిశీలించి బిఎల్ఓ లను ఇంటింటికీ వెళ్లి సమగ్ర సవరణ చేపట్టే విధంగా చూడాలని కోరారు. బి ఎల్ ఓ లు ఇంటింటికి వెళ్లడం ద్వారా ఒకేసారి స్కాన్ చేసి వారి ఫారంలను పూర్తి చేయడం ద్వారా అటు అధికారులకు ఇటు ప్రజలకు పని భారం తేలికగా ఉంటదని ప్రజలు భావిస్తున్నారు. ఇలాగే పంచాయతీ కార్యాలయలలో బి ఎల్ ఓ ల విధులు కొనసాగితే వృద్యాపంలో ఉన్నవారికి అనేక ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బిఎల్ఓ లు ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ జరిపించి ఎలాంటి పొరపాట్లు దొరలకుండా చూడాలని కోరారు.

# పల్లెర్ల చేనేత సహకర సంగం నూతన పాలకవర్గం ఏకగ్రీవ ఎన్నిక



**ఆత్మకూర్( ఎం). రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండల పరిధిలోని పల్లెర్ల గ్రామ చేనేత సహకార సంఘం పాలక వర్గాన్ని చేనేత సహకార సంఘ సభ్యుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు . 9 మంది డైరెక్టర్ల అభ్యర్థులకు ఎన్నికల అధికారి శ్రీనివాస్ నియామక పత్రాలను అందజేశారు . అనంతరం నూతన పాలక వర్గ సభ్యులు ఆఫీస్ బేరర్ లని ఎన్నుకున్నారు . పల్లెర్ల చేనేత సహకార సంఘం అధ్యక్షులుగా పొడుగు వెంకటేశం , ఉపాధ్యక్షులుగా కందగట్ల వెంకటేశం , కార్యదర్శిగా గుర్రం శ్రీనివాస్ , కోశాధికారిగా సాయిని పురుషోత్తం , డైరెక్టర్లుగా గుర్రం మల్లేషం , వట్నాల వెంకటేష్ , జంజీరాల సోమయ్య , ఏలూరి ధనలక్ష్మి వెంకటేశ్వర్లు , రాపోలు శ్వేత వెంకటేష్ లను ఎన్నుకున్నారు . ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన చేనేత సంఘం అధ్యక్షులు పొడుగు వెంకటేశం మాట్లాడుతూ ప్రతి చేనేత కుటుంబానికి కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో చేరేలా కృషి చేస్తానని అన్నారు . చేనేత కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారుల దృష్టికి పాలక వర్గ సభ్యుల సహకారంతో తీసుకెళ్తానని అన్నారు . ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారి శ్రీనివాస్ , చేనేత సంఘం మాజీ అధ్యక్షులు ఏలూరి సుదర్శన్ , మాజీ ఉపాధ్యక్షులు సాయిని అశోక్ , మాజీ డైరెక్టర్లు గుర్రం వాసుదేవ్ , రాపోలు స్వామి , ఏలే నిర్మల , గుర్రం నారాయణ , సాయిని వెంకటేష్ , ఏలే విశ్వనాథం , కందగట్ల వెంకయ్య , ఏలూరి వెంకటేశ్వర్లు , గుర్రం సంతోష్ , వట్నాల లింగస్వామి , రాపోలు వెంకటేష్ , గుర్రం భిక్షపతి , గుర్రం చైతన్య , పొడుగు ముఖేష్ , పొడుగు మోహన్ తదితరులు పాల్గొన్నారు .

## ఘనంగా ఎంఆర్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



**రాజముద్ర న్యూస్, శంకరపట్నం:** పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎంఆర్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం, ఆయన జన్మదిన వేడుకల సందర్భంగా శంకరపట్నం మండలం అంబేద్కర్‌నగర్‌లో ఎంఆర్పీఎస్ జెండాను ఘనంగా ఆవిష్కరించారు. జిల్లా ఇంచార్జి మంద రాజు మాదిగ, మండల ఇంచార్జి దేవుని రవీందర్ మాదిగ సూచనలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు శనిగరపు కిరణ్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ జరిగింది. ముఖ్య అతిథిగా మండల ప్రధాన కార్యదర్శి యమునూరి నాగరాజు పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ ప్రేమలత రమేష్, ఉప సర్పంచ్ శనిగరం అంజి, బీమ్ ఆర్మీ చీఫ్ సెక్రటరీ వాసాల శ్రీనివాస్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు రాచర్ల అంజయ్య మాదిగ, పులికోట విద్యానందం మాదిగ, శనిగరం బాబురావు మాదిగ, సోముడి వంశీ మాదిగ, శనిగరం అన్వేష్ మాదిగ, కనుకుట్ల సాగర్ మాదిగ, పొన్నాల బాబు మాదిగ, శనిగరం కిష్టయ్య మాదిగ, శనిగరపు శంకరయ్య మాదిగ, పులికోట జయరాజు మాదిగ, కనుకుట్ల రాజు మాదిగ పాల్గొన్నారు.

## రైతులకు 24 గంటల కరెంటు ఇవ్వాలి

**ఎస్ ఈ కి వినతి పత్రం అందజేత**



**రామారెడ్డి జూన్ 7 రాజముద్ర న్యూస్:** వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా వ్యవసాయానికి 24 గంటల కరెంటు సరఫరా చేయాలని కామారెడ్డి జిల్లా టీజీఎన్ పిడి సి ఎల్ ఎస్ ఈ కి రామారెడ్డి మాజీ యంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డి అధ్వర్యంలో వినతిపత్రం అందజేయడమైనది ఈ కార్యక్రమంలో పోసానిపేట సర్పంచ్ సుద్దాల లింగం, బీయారెస్ గ్రామ అధ్యక్షుడు తంకరి రవి,రైతు బంధు మాజీ అధ్యక్షుడు సాకలి తిరుపతి, వార్డు సభ్యులు పోతుల లింగారెడ్డి, సాకలి బాలయ్య, గొల్లపల్లి రెడ్డి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.


# ఘనంగా ఎంఆర్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**ఉద్యమ ఆశయాల సాధనే లక్ష్యం - రాజేష్ మాదిగ**



**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్ :** ఖాజాగూడాలో ఎంఆర్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఆర్పీఎస్ అధ్యక్షులు మాస్కురి రాజేష్ మాదిగ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఎంఆర్పీఎస్ జెండాను ఆవిష్కరించి, ఉద్యమ ప్రస్థానాన్ని స్మరించుకున్నారు. రాజేష్ మాదిగ మాట్లాడుతూ, సామాజిక న్యాయం, సమాన హక్కులు, ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా ఎంఆర్పీఎస్ మూడు దశాబ్దాలుగా నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. ఉద్యమ ఆశయాలను ప్రతి కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లి, బడుగు బలహీన వర్గాల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని నాయకులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఉద్యమ బలోపేతానికి ఐక్యంగా కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ మండల అధ్యక్షులు గణేష్, కన్వీనర్లు ప్రేమ్, నరేష్, రాజు, శ్రీనివాస్, పింటూ, సుధాకర్, గ్రామవాసులు తదితరులు పాల్గొని ఎంఆర్పీఎస్ ఉద్యమ స్ఫూర్తిని కొనియాడారు.

## సలకం చెరువు వివాదం: ఫాతిమా ఓవైసీ ఎడ్యుకేషనల్ క్యాంపస్‌పై హైకోర్టు కీలక ఆదేశాలు




**హైదరాబాద్, జూలై 6:** సలకం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో ఫాతిమా ఓవైసీ ఎడ్యుకేషనల్ క్యాంపస్‌కు సంబంధించిన కేసును తెలంగాణ హైకోర్టు విచారిస్తోంది. కోర్టు సంబంధిత ప్రభుత్వ శాఖలు అయిన రెవెన్యూ, ఇరిగేషన్, జీహెచ్ఎంసీ తదితర అధికారులు భూ రికార్డులు, ఎఫ్‌టీఎల్ మ్యాపులు, నిర్మాణ అనుమతులు మరియు ఇతర సంబంధిత పత్రాలను నిర్దేశిత గడువులో సమర్పించాలని ఆదేశించింది. క్యాంపస్ నిర్మాణాలకు అనుమతులు ఎలా మంజూరయ్యాయనే అంశంపై కూడా పూర్తి వివరాలతో వివరణ ఇవ్వాలని సూచించింది. కేసు తుది తీర్పు వెలువడే వరకు వివాదాస్పద ప్రాంతంలో కొత్త నిర్మాణాలు చేపట్టరాదని గతంలో జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులు కొనసాగుతున్నాయి. అలాగే 2026–27 విద్యా సంవత్సరానికి చేపట్టే అడ్మిషన్లు కేసు తుది తీర్పుకు లోబడి ఉంటాయని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ విషయాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులకు తెలియజేసేలా క్యాంపస్‌లో స్పష్టమైన నోటీసులు ప్రదర్శించాలని యాజమాన్యాన్ని ఆదేశించింది. ఇటీవల జరిగిన విచారణలో, వివాదాస్పద ప్రాంగణంలో 2026–27 విద్యా సంవత్సరానికి 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు నిర్వహించేందుకు అనుమతి ఇవ్వలేదని పాఠశాల విద్యాశాఖ కోర్టుకు తెలిపింది. అయితే ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ కోర్సుల అనుమతులు ఉన్నత విద్యాశాఖ పరిధిలో ఉంటాయని వివరించింది. కాగా, ఫాతిమా కాలేజీని వెంటనే కూల్చివేయాలని తెలంగాణ హైకోర్టు తుది ఆదేశాలు జారీ చేసినట్లు అధికారిక సమాచారం ప్రస్తుతం లేదు. ఈ కేసు ఇంకా హైకోర్టులో విచారణలోనే ఉంది.

## సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన బోర్డులను ఏర్పాటు చేయాలి

### వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి




**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఐడిఓసి మీటింగ్ హాల్ నందు వికారాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కే. సుధాకర్ లాల్ సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకుంటున్న వివిధ చర్యలను వివిధ శాఖల మధ్య సమన్వయం గురించి వివరించారు. ముఖ్యంగా ఈ కాలంలో ప్రబలే మలేరియా, డెంగ్యూ నివారణ, నియంత్రణకు తీసుకోవలసిన వివిధ జాగ్రత్తల గురించి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మలేరియా డెంగ్యూ వివిధ సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రభుత్వ కార్యాలయాలలో, సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్ లలో అవగాహన కల్పించే బోర్డులను ఏర్పాటు చేయించాల్సిందిగా డి ఎం హెచ్ ఓ ను ఆదేశించారు. ఈ సమన్వయ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, అసిస్టెంట్ ట్రైని కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూర్ జిల్లా పరిషత్ సీఈవో సుధీర్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఐ డి ఓ సి లో ఏర్పాటుచేసిన దోమలు పెరిగే ప్రదేశాలైన వాడి పరవేసిన కొబ్బరి బొండాలు, పగిలిన మట్టి కుండలు, పాత టైర్లు, ప్లాస్టిక్ వస్తువులు వంటివి ఏర్పాటు చేసిన అవగాహన శిబిరాన్ని సందర్శించారు.

## ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ డిజిటైజేషన్ వేగవంతం చేయాలి

### వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి




**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణలో డిజిటైజేషన్ ప్రక్రియ వేగవంతంగా చేయాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు సోమవారము సాయంత్రం అన్ని మండలాల తహసిల్దార్లు తో జూమ్ సమావేశము నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మంగళవారం నుండి వారము రోజులలో ప్రత్యేక సమగ్ర సవరణ డిజిటైజేషన్ వంద శాతం పూర్తి చేయాలనీ అధికారులకు ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ పకడ్బందిగా చేపట్టాలని, ఎన్యుమరేషన్ ఫారాలలో ఓటర్ల వివరాల నమోదుకుస్తానికంగా ఉండే వాలంటీర్ల సహాయం తీసుకొని పూర్తి చేయాలనీ ఆదేశించారు. ఎన్యుమరేషన్ ఫారాలను తిసుకొని గ్యాప్స్ అన్ని పిలప్ చేయాలనీ, బి ఎల్ ఓ లు, సూపర్ వైజర్లు ఎస్ ఐ ఆర్ పై ద్రుష్టి సారించి పూర్తి చేయాలనీ ఆదేశించారు. ఈ సమావేశములో అదనపు కలెక్టర్ (రెవెన్యు) వెంకటా చారి, డి ఆర్ ఓ స్వర్ణలత, ఆర్ డి ఓ వాసు చంద్ర తదితరులు ఉన్నారు.

# రెక్కలు వచ్చిన ధరలు.. కనిపించని నియంత్రణ

### నేలకొండపల్లి గ్రామాల్లో కిరాణా షాపుల దోపిడీ



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** ఉదయాన్నే కూలీకి వెళ్లే కూలీ.. సాయంత్రం ఇంటికి వచ్చి కిలో పప్పు, అరలీటర్ నూనె కొందామంటే జేబు ఖాళీ అవుతోంది. బియ్యం ధర, కూరగాయల ధర, కిరాణా ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయి. దీనికి తోడు కొలతల్లోనూ మోసం. అడిగే వారు లేరు, చెప్పే వారు లేరు. ఇదే నేడు నేలకొండపల్లి మండల పరిధిలోని గ్రామాల్లో నిత్యం కనిపిస్తున్న దృశ్యం.

**ఆకాశాన్నంటుతున్న ధరలు**

గత కొన్ని నెలలుగా నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయి. పట్టణాల్లో ఒక రేటు, గ్రామాల్లో మరో రేటు. కిరాణా షాపు యజమానులు తమ ఇష్టానుసారం ధరలు నిర్ణయిస్తున్నారు. పప్పు, నూనె, పంచదార, సబ్బులు.. ఏ వస్తువు తీసుకున్నా ఎంఆర్‌పి కంటే రూ.10 నుంచి రూ.30 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. "ఈ రేటుకే తీసుకోవాలి. తీసుకోకపోతే లేదు" అని నిలదీసి మాట్లాడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కరువు, పంట నష్టాలతో అల్లాడుతున్న కష్టజీవులపై ఇది మరో పెనుభారం.

**త్రాసులోనూ మోసం - కనిపించని అధికారులు**

ధరల దోపిడీ ఒక్కటే కాదు. చాలా కిరాణా దుకాణాల్లో త్రాసులు, బరువుల కొలతలు సరిగా లేవు. కిలోకు 100 గ్రాములు తక్కువ కొలుస్తున్నా ప్రశ్నించే వారు లేరు. ధరల నియంత్రణ, కొలతల తనిఖీ బాధ్యత ఉన్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్, పౌరసరఫరాల శాఖ అధికారులు నెలల తరబడి గ్రామాల వైపు రావడం లేదు. వారి నిర్లక్ష్యమే వ్యాపారులకు అలుసుగా మారింది. తనిఖీలు లేవు, జరిమానాలు లేవు.. దీంతో కిరాణా షాపులు "దోపిడీ కేంద్రాలు"గా మారాయి.

**అమాయక ప్రజల గోడు**

రోజుకు రూ.400, రూ.500 సంపాదించే వ్యవసాయ కూలీ, నిర్మాణ కార్మికుడు.. నెల జీతం మొత్తం కిరాణాకే సరిపోతోంది. పిల్లల చదువులు, ఇంటి ఖర్చులు ఎలా చూసుకోవాలో అర్థం కావడం లేదు. అధికారులకు ఫిర్యాదు చేయాలన్నా "ఎవరు వింటారు? ఎవరు వస్తారు?" అనే నిస్పృహ ప్రజల్లో ఉంది. వ్యాపారుల దోపిడీకి, అధికారుల నిర్లక్ష్యానికి అమాయక జనం బలవుతున్నారు.

**పరిష్కారం ఏమిటి?**

ఆకస్మిక తనిఖీలు:జిల్లా కలెక్టర్, పౌరసరఫరాల అధికారులు వెంటనే మండలంలోని ప్రతి గ్రామంలోని కిరాణా షాపులపై ఆకస్మిక దాడులు చేయాలి. ధరల జాబితా: ప్రతి షాపు ముందు నిత్యావసరాల ధరల జాబితాను తప్పనిసరిగా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలి. త్రాసుల తనిఖీ: లీగల్ మెట్రాలజీ అధికారులతో త్రాసుల కొలతలను పరిశీలించి, తప్పుడు త్రాసులు స్వాధీనం చేసుకోవాలి.ప్రజా ఫిర్యాదు వ్యవస్థ: 1967 టోల్‌ఫ్రీ నెంబర్, జిల్లా కంట్రోల్ రూమ్ నెంబర్లను ప్రతి గ్రామంలో ప్రచారం చేయాలి.ప్రభుత్వం "పేదల సంక్షేమం" అని చెబుతుంది. కానీ పేదవాడి కడుపు కొట్టే ఈ దోపిడీని అరికట్టకపోతే ఆ మాటలకు అర్థం ఉండదు. అధికారులు ఇప్పటికైనా కళ్లు తెరవాలి. లేకుంటే ప్రజలే కలిసి రోడ్డెక్కి తమ గొంతు వినిపించాల్సి వస్తుంది. "ఆకలి చావుల కంటే, దోపిడీ చావు ఎక్కువ బాధిస్తుంది" – ఇది నేడు నేలకొండపల్లి గ్రామాల్లో వినిపిస్తున్న ప్రతి కుటుంబం గొంతు.

## నిషేధిత బీటీ-3 పత్తి నాటితే కఠిన చర్యలు

### మండల వ్యవసాయ అధికారి నారెడ్డి సీతారామరెడ్డి హెచ్చరిక



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా నిషేధిత బీటీ–3 పత్తి విత్తనాలను సాగు చేస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తిరుమలాయపాలెం మండల వ్యవసాయ అధికారి నారెడ్డి సీతారామ రెడ్డి రైతులను హెచ్చరించారు. సోమవారం మండల పరిధిలోని టెట్టెలపాడు, దమ్మాయిగూడెం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల సర్పంచుల సమక్షంలో పత్తి సాగు చేసిన రైతులను కలిసి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా బీటీ–3 పత్తి సాగు వల్ల కలిగే నష్టాలను రైతులకు వివరించారు. దీనిపై స్పందించిన స్థానిక రైతులు.. తాము మొదట బీటీ–3 పత్తి వేయాలని భావించినప్పటికీ, వ్యవసాయ శాఖ ముందుగానే ఇచ్చిన సూచనలు, అవగాహన వల్ల ఆ ఆలోచనను విరమించుకున్నట్లు ఏఓకు తెలిపారు. అధికారుల మాటలు విని నిషేధిత విత్తనాలకు దూరంగా ఉన్నందుకు రైతులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

**రేపటిలోగా 100% సబ్సిడీతో పత్తి విత్తనాలు!**

ఇప్పటివరకు వివిధ కారణాల వల్ల పత్తి సాగు చేయలేకపోయిన రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని ఏఓ సూచించారు. అలాంటి వారు హెచ్‌డీపీఎస్ విధానంలో పత్తి సాగు చేసుకునేందుకు వ్యవసాయ శాఖ ద్వారా 100 శాతం సబ్సిడీతో విత్తనాలను అందిస్తున్నట్లు ప్రకటించారు. అర్హులైన రైతులు రేపటి (మంగళవారం) లోపల ఈ సబ్సిడీ విత్తనాలను పొంది, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిర్ర నర్సమ్మ ఏఈఓ రైతులు తదితరులు పాల్గొన్నారు

**నకిలీలపై నిఘా ఉంచండి..**

గ్రామాల్లో తిరుగుతూ ఎవరైనా నకిలీ విత్తనాలు, నకిలీ పురుగుమందులు లేదా నకిలీ ఎరువులు విక్రయిస్తూ గుర్తిస్తే వెంటనే వ్యవసాయ అధికారులకు లేదా పోలీస్ శాఖకు సమాచారం అందించాలని రైతులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వంచే నిషేధించబడిన ఏ రకమైన విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు వాడినా ఉపేక్షించేది లేదని, విక్రయదారులతో పాటు వాడే వారిపై కూడా చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్లు ఆసియా, ప్రదీప్‌లతో పాటు స్థానిక సర్పంచులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## మహనీయులలో దేశానికి అత్యంత ఎక్కువ సేవలందించిన వ్యక్తి బాబు జగ్జీవన్ రామ్

### మహాజన సోషలిస్ట్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షులు పి ఆనంద్



**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** భారత మాజీ ఉప ప్రధాని స్వాతంత్ర సమరయోధుడు రాజకీయ దురంధరుడు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 40 వ వర్ధంతి సందర్భంగా సోమవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఆయన విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది.ఈ సందర్భంగా మహాజన సోషలిస్ట్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షులు ఆనంద్ మాట్లాడుతూ అణగారిన కులంలో ఒక కు గ్రామంలో జన్మించిన బాబు జగ్జీవన్ రామ్ బాల్యం దశలో పాఠశాలలోకి కనీసం ప్రవేశం కూడా సరిగా లేనటువంటి రోజులలో చదువుకొని విద్యార్థి నాయకునిగా రాజకీయ నాయకునిగా అతి చిన్న వయసులోనే దేశానికి స్వాతంత్రం రాకుంటే ముందే ముందస్తుగా ఏర్పడ్డ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ప్రయాణం ఈ దేశంలో మనం కొలుస్తున్న మహానీలలో అత్యంత ఎక్కువ కాలం దేశానికి సేవలు అందించిన ఏకైక వ్యక్తి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అన్నారు. ఈ దేశంలో కరువుతో ఏ వ్యక్తిని కూడా చావనీయనని హరిత విప్లవానికి నాంది పలికి కరువును తరిమితోలిన గొప్ప నాయకుడు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అంతే కాకుండా రక్షణ మంత్రిగా ఉండి బంగ్లాదేశ్ విముక్తి ప్రదాతగా నిలిచి బంగ్లాదేశ్ దేవుడు లాగా కొలిచే వ్యక్తిగా వాళ్ళ మన్ననలు పొందిన వ్యక్తి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అన్నారు. ఎన్నో కార్మిక చట్టాలు ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ కాలం పార్లమెంట్ సభ్యునిగా పనిచేసిన మొదటి వ్యక్తి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ఈ సందర్భంగా ప్రతి యువత ఆయన ఆశయాలను ముందుకు తీసుకు వెళ్లాల్సిన అవసరం కచ్చితంగా ఉందని, ప్రతి యువత దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావలసిందిగా తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహనీయుల ఉత్సవ కమిటీ సభ్యులు వివిధ ప్రజా సంఘాల నాయకులు న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## భరోసా టీం సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం

- పలు చట్టాలపై తక్షణ సహాయం కొరకు అవగాహన
- కౌన్సిలింగ్ పునరావాసం కల్పించిన పై ముందుకు సాగాలి
- కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి
- వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా




**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో భరోసా టీం, సంబంధిత అధికారులతో ప్రత్యేక సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, లైంగిక వేధింపులు, గృహ హింస, పోక్సో (పోక్సో) చట్టం పరిధిలోకి వచ్చే కేసుల్లో బాధితులకు భరోసా కేంద్రాల ద్వారా తక్షణ సహాయం, రక్షణ, న్యాయం అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు. బాధితులకు కేవలం చట్టపరమైన సహాయమే కాకుండా, వారికి అవసరమైన వైద్య సేవలు, కౌన్సిలింగ్ పునరావాసం కల్పించడంలో అన్ని విభాగాలు సమన్వయంతో ముందుకు సాగాలని ఆమె స్పష్టం చేశారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నేరస్థులకు తగిన శిక్ష పడేలా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, బాధితుల్లో ధైర్యాన్ని నింపేందుకు భరోసా కేంద్రం ఒక దిక్సూచిలా పనిచేయాలని ఆమె అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమిస్తూ, ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూడటమే మన ప్రాధాన్యత కావాలని ఎస్పీ స్నేహ మెహ్రా ఈ సమావేశంలో తెలిపారు.ఈ ప్రత్యేక సమావేశంలో అదనపు ఎస్పీ రాజేష్ మీనా, డీసీఆర్ బీ డీఎస్పీ జానయ్య, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, వికారాబాద్ డీఎస్పీ అంజయ్య, పరిగి, మోమిన్‌పేట్, ధరూర్, కొడంగల్ సర్కిల్ ఇన్స్పెక్టర్లు, ఏహెచ్‌టీయూ ఇన్స్పెక్టర్ ఎస్.కె. అన్వర్ పాషా, భరోసా సెంటర్ ఇంచార్జి శ్వేత, సిడబ్ల్యూసి చైర్‌పర్సన్ వెంకటేశం, సభ్యులు ప్రకాష్, డిఎల్ఎస్ఎ సభ్యులు వెంకటేశం, డిసిపియు ఇంచార్జ్ శ్రీకాంత్, షఫీ, చైల్డ్ లైన్ రాజు నాయక్, లీగల్ సెల్ నుండి నరేష్ కుమార్, సఖి సెంటర్ ఇంచార్జి యశోద, సాధన ఎన్జీవో నర్సింలు, గౌరీ, ఎడ్యుకేషన్ జిసిడివో శ్రీదేవి, హెల్త్ డిపార్ట్‌మెంట్ నుండి డాక్టర్ నిఖిల్ (సి ఎ ఎస్), డి ఆర్ డి ఏ డీపీఎం నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

# ‘సర్పంచ్ సాబ్’ సత్తాకు పరీక్ష




- ఆ స్టార్స్ రాణించకుంటే అంతే సంగతులు!
- భారత్, ఇంగ్లండ్ మధ్య మూడో టీ20
- భారత జట్టులో కీలక మార్పులు

భారత్, ఇంగ్లండ్ మధ్య జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఈరోజు రాత్రి మూడో టీ20 జరగనుంది. ఈ మ్యాచ్‌కు ముందు భారత జట్టులో కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశాలు ఉన్నాయి. తొలి రెండు మ్యాచ్‌ల్లో ఆశించిన ఫలితాలు రాకపోవడంతో.. టీమ్ మేనేజ్‌మెంట్ కూర్పులో కొన్ని మార్పులు చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఎంట్రీతో వికెట్ కీపర్ బ్యాటర్ సంజు శాంసన్‌కు మరోసారి నిరాశ తప్పదు. ఓపెనర్లుగా అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ జోడీ కొనసాగనుంది. రెండో టీ20లో వైభవ్ తన అరంగేట్ర మ్యాచ్‌లో దూకుడు బ్యాటింగ్‌తో ఆకట్టుకోవడంతో టీమ్ మేనేజ్‌మెంట్ అతడిపై విశ్వాసం ఉంచింది. దీంతో సంజు శాంసన్‌కు తుది జట్టులో చోటు దక్కే అవకాశాలు లేవు. బుడ్డోడి నుంచి మేనేజ్‌మెంట్ భారీ ఇన్నింగ్స్ ఆశిస్తోంది. ఇషాన్ కిషన్, శ్రేయాస్ అయ్యర్, తిలక వర్మలు బ్యాట్ ఝులిపించాల్సిన అవసరం ఉంది. అలానే శివమ్ దూబె కూడా కీలక పరుగులు చేయాలని ఫాన్స్ కోరుకుంటున్నారు. బౌలింగ్ విభాగంలో కూడా మార్పులు జరగనున్నాయి. స్పిన్నర్ రవి బిష్ణోయ్‌ను తప్పించి యువ పేసర్ ప్రిన్స్ యాదవ్‌ను తిరిగి తుది జట్టులోకి తీసుకునే అవకాశాలు ఉన్నాయి. పేస్ దళంలో యాదవ్‌తో పాటు అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణాలు కొనసాగనున్నారు. స్పిన్ విభాగంలో అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి జోడీ కొనసాగనుంది. ముఖ్యంగా వరుణ్ ఇటీవల అద్భుత ఫామ్‌లో లేకపోవడం భారత జట్టుకు మైనస్ అయింది. తన వైవిధ్యమైన స్పిన్‌తో ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెడితే టీమిండియాకు తిరుగుండదు. ఈ మ్యాచ్ భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు కూడా ఎంతో కీలకంగా మారింది. సిరీస్‌లో ఇంకా విజయాన్ని నమోదు చేయని భారత్‌కు మూడో టీ20 ‘డూ ఆర్ డై’ మ్యాచ్‌లా మారింది. ఈ మ్యాచ్‌లో గెలిస్తేనే సిరీస్‌లో నిలబడే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో ‘సర్పంచ్ సాబ్’ కెప్టెన్సీ సత్తాకు పరీక్షగా నిలవనుంది. అలానే స్టార్ రాణించకుంటే.. ఈ మ్యాచ్ ఫలితంపై ప్రభావం చూపనుంది. యువ ఆటగాళ్లతో కూడిన జట్టు ఒత్తిడిని అధిగమించి విజయాన్ని అందుకోవాలని భారత అభిమానులు ఆశిస్తున్నారు.

# వైభవ్ కాదు.. శాంసన్‌పై వేటుకు ఆ చిచ్చరపిడుగే కారణం!





స్వదేశంలో ముగిసిన టీ20 ప్రపంచకప్‌లో భారత్‌ను గెలిపించిన సంజూ శాంసన్ అనూహ్యంగా ఇప్పుడు స్క్వాడ్‌లో లేదు. మూడు మ్యాచుల్లో విఫలమయ్యాడని అతడిని జింబాబ్వే పర్యటనకు తప్పించారు. అయితే.. యువసంచలనం వైభవ్ సూర్యవంశీ కోసమే శాంసన్‌ను పక్కనపెట్టేశారనే ప్రచారం జరుగుతోంది. కానీ, ఆసియా క్రీడల స్క్వాడ్‌లో భాగమైన సంజూను జింబాబ్వే సిరీస్‌కు తీసుకోకపోవడానికి కారణం వైభవ్ కాదని, ఐపీఎల్‌లో దంచేస్తున్నచిచ్చరపిడుగు అని సెలెక్టర్లు చెప్పినట్టు క్రిక్ఇన్ఫో కథనం పేర్కొంది. ఐర్లాండ్ చేతిలో వైట్‌వాష్, ఇంగ్లండ్ చేతిలో పరాజయంతో భారత సెలెక్టర్లు టీ20 స్క్వాడ్‌లో భారీ మార్పులు చేశారు. జింబాబ్వే పర్యటనకు పలువురిని పక్కనపెట్టి.. ఐపీఎల్‌లో, దేశవాళీ క్రికెట్‌లో రాణించిన వాళ్లను ఎంపిక చేశారు. ఓపెనర్‌గా విఫలమవుతున్న సంజూ శాంసన్‌పై వేటు వేశారు. దాంతో, వైభవ్ సూర్యవంశీ కోసమే సంజూను తప్పించారనే విమర్శలు వెల్లువెత్తాయి. అయితే.. అందరూ అనుకుంటున్నట్టు వైభవ్ కోసం సంజూను పక్కనపెట్టలేదని.. టీ20ల్లో చితక్కొడుతున్న ప్రభ్‌సిమ్రన్ సింగ్‌కు అవకాశం ఇవ్వాలనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు సెలెక్టర్లు చెప్పారని క్రిక్ఇన్ఫో కథనం వెల్లడించింది. ‘సొంతగడ్డపై జరిగిన పొట్టి వరల్డ్‌కప్‌లో విధ్వంసక ఇన్నింగ్స్‌లు ఆడిన సంజూ శాంసన్ టీ20 స్క్వాడ్‌లో భాగమే. సెప్టెంబర్‌లో జపాన్ వేదికగా మొదలయ్యే ఆసియా క్రీడల స్క్వాడ్‌లోనూ శాంసన్ ఉన్నాడు. అయితే.. జింబాబ్వే పర్యటనకు పెద్దగా ప్రాధాన్యం లేనందునే అతడిని ఎంపిక చేయలేదు. చిన్న సిరీస్‌కు ఇద్దరు సీనియర్ వికెట్ల కీపర్లు ఇషాన్ కిషన్, సంజూలను ఎంపిక చేయడం సరైంది కాదనిపించింది. ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్ తరఫున గత రెండు సీజన్లలో ప్రభ్‌సిమ్రన్ సింగ్ మెరుగైన ప్రదర్శన చేస్తున్నాడు. అందుకని వికెట్ కీపర్, బ్యాటరైన అతడికి అవకాశం ఇవ్వాలనుకున్నాం’ అని అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలెక్టర్ల బృందం పేర్కొన్నట్టు క్రిక్ఇన్ఫో తెలిపింది. జింబాబ్వే సిరీస్ కోసం సోమవారం శ్రేయాస్ అయ్యర్ సారథిగా 15 మందితో కూడిన స్క్వాడ్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. జింబాబ్వేతో టీ20 సిరీస్ కోసం భారత సెలెక్టర్లు స్క్వాడ్‌లో కీలక మార్పులు చేశారు. ఇంగ్లండ్ పర్యటనకు ఎంపికైన వారిలో సగం మందిని తప్పించి కొత్త వాళ్లకు ప్రాధాన్యమిచ్చారు. ఐర్లాండ్‌పై తేలిపోయిన ఓపెనర్ సంజూ శాంసన్‌పై వేటు పడగా.. ఓపెనర్‌గా వైభవ్ సూర్యవంశీకి మరో అవకాశం దక్కింది. అలానే వికెట్ కీపర్‌గా ప్రభ్‌సిమ్రన్ సింగ్ ఎంపికవ్వగా.. మిడిలార్డర్ బ్యాటర్‌గా సూర్యాన్ష్ షెడ్గే, ఫినిషర్‌గా రింకూ సింగ్‌ను తీసుకున్నారు. ఐపీఎల్ 19వ సీజన్‌లో మెరిసిన ప్రిన్స్ యాదవ్, అశోక్ శర్మ, హర్ష్ దూబే, మయాంక్ యాదవ్‌లో బౌలింగ్ దళంలో చోటు దక్కించుకున్నారు. భారత్, జింబాబ్వే మధ్య జూలై 23 నుంచి హరారేలో టీ20 సిరీస్ మొదలవ్వనుంది. ఈ సిరీస్‌తో ప్రభ్‌సిమ్రన్ అంతర్జాతీయ టీ20ల్లో అరంగేట్రం చేయనున్నాడు.

# ఎల్లీస్ పెర్రీ..

- మరోసారి అద్భుత ప్రదర్శన చేసిన ఎల్లీస్ పెర్రీ
- 7 మ్యాచ్‌లలో 198 పరుగులు, 4 వికెట్స్
- క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమ ఆల్‌రౌండర్

■ మహిళల క్రికెట్‌కు చిరునామా.. ■ చరిత్రలోనే గొప్ప ఆల్‌రౌండర్!








ఆస్ట్రేలియా మహిళల క్రికెట్ స్టార్ ఎల్లీస్ పెర్రీ మరోసారి తన అద్భుత ఆటతో ప్రపంచ క్రికెట్ అభిమానుల ప్రశంసలు అందుకుంటోంది. మహిళల టీ20 ప్రపంచ కప్‌లో ఈ ఆసీస్ అందం 7 మ్యాచ్‌లలో 198 పరుగులు చేయడమే కాకుండా 4 వికెట్లు పడగొట్టింది. మెగా టోర్నమెంట్‌లో బ్యాట్, బాల్ రెండింటితోనూ అద్భుతంగా రాణించింది. బ్యాటింగ్‌లో 49.50 సగటు, 132.88 స్ట్రైక్ రేట్‌ను నమోదు చేసింది. బౌలింగ్‌లో 7.50 సగటును కొనసాగించింది. ఆసీస్ పొట్టి కప్ గెలవడంలో పెర్రీ తన వంతు పాత్ర పోషించింది. బ్యాట్‌తో పరుగులు, బంతితో వికెట్లు, కీలక మ్యాచ్‌ల్లో అద్భుత ప్రదర్శనలతో ఎల్లీస్ పెర్రీ మహిళల క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమ ఆల్‌రౌండర్లలో ఒకరిగా గుర్తింపు పొందింది. ఇప్పటికే తొమ్మిది ఐసీసీ ట్రోఫీలు గెలుచుకున్న ఆమె.. ఆస్ట్రేలియా విజయాల్లో కీలక పాత్ర పోషిస్తూ సరికొత్త చరిత్రలు సృష్టిస్తోంది. పెర్రీ కెరీర్‌లో మరో విశేషం ఏమిటంటే.. ఆమె కేవలం క్రికెటర్ మాత్రమే కాదు, ఫుట్‌బాలర్ కూడా. ఆస్ట్రేలియా తరఫున అంతర్జాతీయ స్థాయిలో క్రికెట్‌తో పాటు ఫుట్‌బాల్ కూడా ఆడిన అరుదైన క్రీడాకారిణి. రెండు క్రీడల్లోనూ దేశానికి ప్రాతినిధ్యం వహించిన ఆమె బహుముఖ ప్రజ్ఞకు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు లభించాయి. టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో 1,000కిపైగా పరుగులు చేయడంతో పాటు 100కిపైగా వికెట్లు తీసిన తొలి మహిళా క్రికెటర్ కూడా ఎల్లీస్ పెర్రీనే. బ్యాటింగ్, బౌలింగ్ రెండింట్లోనూ రాణిస్తూ మహిళల క్రికెట్‌లో కొత్త ప్రమాణాలు నెలకొల్పింది. అందుకే ఆమె ప్రపంచ క్రికెట్‌లో గొప్ప ఆల్‌రౌండర్ అయింది. టెస్టు క్రికెట్‌లోనూ పెర్రీ రికార్డులు సృష్టించింది. ఆస్ట్రేలియా మహిళా క్రికెటర్‌గా అజేయంగా 213 పరుగులు చేసి అత్యధిక వ్యక్తిగత స్కోరు నమోదు చేసిన ఆటగాడిగా నిలిచింది. వ్యక్తిగత విజయాలతో పాటు జట్టు విజయాల్లోనూ ఎల్లీస్ పెర్రీ కీలక పాత్ర పోషించింది. ఆమె ఖాతాలో ఇప్పటికే 9 ఐసీసీ ట్రోఫీలు ఉన్నాయి. అలాగే రెండుసార్లు ఉమెన్స్ బిగ్ బాష్ లీగ్ టైటిల్, ఒకసారి ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ టైటిల్‌ను కూడా గెలుచుకుంది. అంతేకాదు ఐసీసీ మహిళా క్రికెటర్ ఆఫ్ ది డికేడ్ అవార్డును సొంతం చేసుకుని తన గొప్పతనాన్ని మరోసారి నిరూపించింది. దాదాపు రెండు దశాబ్దాలుగా నిలకడగా ఆడుతున్న పెర్రీ.. ప్రపంచవ్యాప్తంగా యువ క్రికెటర్లకు ఆదర్శంగా నిలుస్తోంది. ఆమె సాధించిన విజయాలు, నెలకొల్పిన రికార్డులు మహిళల క్రికెట్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయి.




# ర్యాంకింగ్స్ టాప్‌లో ఇండియన్ ప్లేయర్

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ తాజాగా విడుదల చేసిన మహిళా టీ20 ఆటగాళ్ల ర్యాంకింగ్స్‌లో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. ఇటీవల ముగిసిన మహిళా టీ20 వరల్డ్ కప్ 2026లో అద్భుత ప్రదర్శన చేసిన ఆస్ట్రేలియా ఓపెనర్ బెత్ మూనీ మళ్లీ నంబర్-1 బ్యాటర్‌గా అవతరించింది. ఆమె తన కెరీర్‌లో ఈ ఘనత సాధించడం ఇది ఐదోసారి. వరల్డ్ కప్‌లో ‘ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్’ అవార్డును గెలుచుకున్న మూనీ, ఫైనల్‌లో ఇంగ్లాండ్‌పై 64 పరుగుల మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడి అగ్రస్థానానికి చేరుకుంది. ఈ టోర్నమెంట్ ఫైనల్‌లో ఇంగ్లాండ్‌ను ఓడించి ఆస్ట్రేలియా ఏడోసారి ప్రపంచకప్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. బ్యాటింగ్ ర్యాంకింగ్స్ టాప్-10 జాబితాలో ముగ్గురు భారతీయ ఆటగాళ్లకు చోటు దక్కింది. భారత స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన ఐదో స్థానంలో కొనసాగుతుండగా, షెఫాలీ వర్మ ఆరో స్థానంలో, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ పదో స్థానంలో నిలిచారు. సౌతాఫ్రికాకు చెందిన లారా వోల్వార్డ్ మూడో స్థానంలో, వెస్టిండీస్ ఆల్ రౌండర్ హేలీ మాథ్యూస్ నాలుగో స్థానంలో ఉన్నారు. బౌలింగ్ విభాగంలో భారత్‌కు చెందిన యువ స్పిన్నర్ శ్రీ చరణి సరికొత్త రికార్డు సృష్టించి T20I బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో నంబర్-1 స్థానాన్ని కైవసం చేసుకుంది. వరల్డ్ కప్‌లో కేవలం ఐదు మ్యాచ్‌ల్లోనే 14 వికెట్లు పడగొట్టి టోర్నమెంట్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచింది. ఐసీసీ ప్రకటించిన ‘టీమ్ ఆఫ్ ది టోర్నమెంట్’ లో చోటు దక్కించుకున్న ఏకైక భారతీయ ఆటగాడిగా ఆమె నిలిచింది. బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో ఇంగ్లాండ్‌కు చెందిన సోఫీ ఎక్లెస్టోన్ రెండో స్థానంలో, చార్లీ డీన్ మూడో స్థానంలో నిలిచారు. ఇక ఆల్‌రౌండర్ల జాబితాలో వెస్టిండీస్ ఆటగాడు హేలీ మాథ్యూస్ తన నంబర్-1 స్థానాన్ని నిలబెట్టుకుంది.

# గౌతమ్ గంభీర్‌కు బిగ్ షాక్..

## టీమిండియాకు కొత్త హెడ్ కోచ్ వచ్చేశారు.

భారత క్రికెట్ నియంత్రణ మండలి జింబాబ్వే పర్యటనకు వెళ్లే 15 మంది సభ్యుల భారత జట్టును ప్రకటించిన తర్వాత.. తాజాగా టీమ్ కోచింగ్ స్టాఫ్‌కు సంబంధించిన ఒక కీలక అప్‌డేట్ వెలుగులోకి వచ్చింది. జింబాబ్వే పర్యటనకు ప్రస్తుత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ వెళ్లడం లేదు. ఆయన స్థానంలో టీమిండియా మాజీ క్రికెటర్, ప్రస్తుతం ‘సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్’ అధిపతిగా ఉన్న వీవీఎస్ లక్ష్మణ్ తాత్కాలిక హెడ్ కోచ్‌గా బాధ్యతలు వహించనున్నారు.

### బిజీ షెడ్యూల్ వల్లే ఈ నిర్ణయం..

భారత జట్టు రాబోయే రోజుల్లో వరుస అంతర్జాతీయ సిరీస్‌లతో బిజీగా ఉండటమే ఇందుకు ప్రధాన కారణం. ప్రస్తుతం గౌతమ్ గంభీర్ భారత జట్టుతో కలిసి ఇంగ్లాండ్ పర్యటనలో ఉన్నారు. ఈ సిరీస్ ముగిసిన కొద్ది రోజులకే జూలై 23 నుంచి జింబాబ్వే పర్యటన ప్రారంభం కానుంది. గంభీర్‌కు విశ్రాంతినిస్తూ, పనిభారాన్ని తగ్గించేందుకు గానూ ఈ పర్యటన బాధ్యతలను లక్ష్మణ్‌కు అప్పగించారు.

జింబాబ్వే పర్యటనతో పాటు ఈ ఏడాది సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జపాన్‌లో జరిగే ఏషియన్ గేమ్స్ 2026 లో కూడా భారత జట్టుకు లక్ష్మణ్ హెడ్ కోచ్‌గా వ్యవహరిస్తారు. అదే సమయంలో వెస్టిండీస్ జట్టు భారత్‌లో పర్యటించనుంది. రెండు సిరీస్‌లు ఒకేసారి జరగడం వల్ల గంభీర్ సీనియర్ జట్టుతో కలిసి వెస్టిండీస్ సిరీస్‌లో ఉంటారు, లక్ష్మణ్ ఏషియన్ గేమ్స్ జట్టును నడిపిస్తారు.

### సపోర్ట్ స్టాఫ్‌లో మరికొంతమంది..

వీవీఎస్ లక్ష్మణ్‌తో పాటు సపోర్ట్ స్టాఫ్‌లో మరో ఇద్దరు మాజీ భారత ఆటగాళ్లకు చోటు లభించింది. మాజీ క్రికెటర్ కనిత్కర్ బ్యాటింగ్ కోచ్‌గా, మాజీ స్పిన్నర్ సునీల్ జోషి బౌలింగ్ కోచ్‌గా బాధ్యతలు నిర్వహించనున్నారు. ఈ కోచింగ్ త్రయం జింబాబ్వే సిరీస్, ఏషియన్ గేమ్స్ తర్వాత బంగ్లాదేశ్‌తో జరిగే పరిమిత ఓవర్ల సిరీస్‌లోనూ కొనసాగే అవకాశం ఉంది. గౌతమ్ గంభీర్ కోచింగ్ లో టీమిండియా ఛాంపియన్స్ ట్రోఫీ 2025, టీ20 వరల్డ్ కప్ 2026 వంటి పెద్ద టోర్నీలను గెలిచినప్పటికీ, ఇటీవల ఐర్లాండ్ మరియు ఇంగ్లాండ్ చేతుల్లో ఎదురైన పరాజయాల నేపథ్యంలో రాబోయే సిరీస్‌లు భారత జట్టుకు ఎంతో కీలకంగా మారాయి.



# డిఫరెంట్ లుక్‌లో డ్రాగన్.. ఎన్టీఆర్

ఎన్టీఆర్, సంచలన దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ మూవీ డ్రాగన్ . ఈ సినిమాలోని తన పాత్ర కోసం తారక్ ఎన్నడూ లేని విధంగా భారీగా బరువు తగ్గారు. ఆ మధ్య బయటకు వచ్చిన తారక్ అల్ట్రా స్లిమ్ మేకోవర్ చూసి అభిమానులు ఒకింత షాక్‌కు గురయ్యారు. ఒక సినిమా కోసం ఇంతలా బరువు తగ్గాలా అని కంగారు పడుతూ, తమ హీరో లుక్ చూసి అభిమానులతో పాటు సగటు సినీ ప్రేక్షకులు కూడా తీవ్ర ఆందోళన చెందారు. అయితే, ఎన్టీఆర్ బర్త్‌డే కానుకగా విడుదలైన 'డ్రాగన్' గ్లింప్స్ చూసి ఫ్యాన్స్ పిచ్చెక్కిపోయినప్పటికీ, ఆ లుక్ వెనుక ఉన్న తారక్ కష్టం వారిని ఇబ్బంది పెడుతూనే వచ్చింది. ఇందులో 'లూగర్' అనే పవర్‌ఫుల్ క్యారెక్టర్ లుక్ కోసం ఎన్టీఆర్ తన ప్రాణం పెట్టి పనిచేశారు. సినిమా కోసం, తను నమ్మిన పాత్ర కోసం తారక్ ఎంతటి రిస్క్ అయినా తీసుకోగలడు, ఏ స్థాయికైనా వెళ్లగలడు అని తన అంకితభావంతో మరోసారి నిరూపించారు. క్యారెక్టర్‌లోని ఇంటెన్సిటీ చూశాక ప్రశాంత్ నీల్ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విధ్వంసం సృష్టించబోతున్నాడో అని అందరిలో ఆసక్తి రెట్టింపయింది. అభిమానుల్లో ఉన్న ఆ టెన్షన్‌ను పటాపంచలు చేస్తూ జూలై 6న సోషల్ మీడియాలో ఒక క్రేజీ అప్‌డేట్ వచ్చింది. అక్కినేని అఖిల్ నటిస్తున్న 'లెనిన్' మూవీ కోసం ఎన్టీఆర్ వాయిస్ ఓవర్ ఇచ్చారు. ఈ విషయాన్ని పంచుకుంటూ అఖిల్ తన సోషల్ మీడియాలో తారక్‌తో దిగిన లేటెస్ట్ ఫొటోలను షేర్ చేశారు. ఆ ఫొటోలు చూసిన అభిమానులు ఒక్కసారిగా హమ్మయ్య అంటూ ఊపిరి పీల్చుకున్నారు. ఎన్టీఆర్ ఇప్పటికీ స్లిమ్‌గానే ఉన్నప్పటికీ, మునపటి కంటే ఎంతో ఫ్రెష్‌గా, గ్లోయింగ్‌గా, స్టైలిష్‌గా కనిపిస్తుండడంతో నెట్టింట కామెంట్ల వర్షం కురుస్తోంది. ఈ సరికొత్త లుక్ చూసి కుదుటపడిన ఫ్యాన్స్, ఇక 'డ్రాగన్' సినిమాలో తారక్ విశ్వరూపం ఎలా ఉండబోతుందో అని ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు. ప్రశాంత్ నీల్ సినిమాలో ఊరమాస్, హై-వోల్టేజ్ యాక్షన్ రోల్ తర్వాత.. త్రివిక్రమ్ మైథాలజికల్ సినిమాలో ఎన్టీఆర్ ఎలా కనిపిస్తారు? అక్కడ తన మేకోవర్ ఎలా ఉండబోతోంది? అనే ఆసక్తి అప్పుడే టాలీవుడ్ వర్గాల్లో మొదలైంది.




# నా అందాలు దాచేసుకున్నా

## నటి కృతి సనన్ సంచలన విషయం వెల్లడి



గ్లామర్ ఇండస్ట్రీలో సక్సెస్ వేవ్‌ను రైడ్ చేయడం ఒక ఎత్తయితే, పర్సనల్ లైఫ్‌ను బ్యాలెన్స్ చేయడం మరో ఎత్తు. ముఖ్యంగా ముప్పై ఏళ్లు దాటుతున్నాయంటే చాలు.. సొసైటీ నుంచి వచ్చే ప్రెజర్, పెళ్లి - పిల్లల డెడ్‌లైన్స్ హీరోయిన్లను కాస్త టెన్షన్ పెడుతుంటాయి. కానీ ఆ రూల్స్ అన్నిటికీ చెక్ పెడుతూ బాలీవుడ్ మోస్ట్ హ్యాపెనింగ్ బ్యూటీ కృతి సనన్ ఒక సంచలన విషయాన్ని తీసుకుంది. తాను కెరీర్ ఫుల్ పీక్స్‌లో ఉన్నప్పుడే 'ఎగ్ ఫ్రీజింగ్' చేయించుకున్నానంటూ బోల్డ్ స్టేట్‌మెంట్ ఇచ్చింది. ఇటీవల 'హ్యూమన్స్ ఆఫ్ బాంబే' పాడ్‌కాస్ట్‌లో హోస్ట్ కరిష్మాతో మాట్లాడిన కృతి ఈ విషయాన్ని బయటపెట్టింది. కృతిసనన్ తనకు నేషనల్ అవార్డు తెచ్చిపెట్టిన 'మిమి' సినిమా షూటింగ్ టైమ్‌లోనే ఈ డెసిషన్ తీసుకున్నట్లు చెప్పింది. ఈ సినిమాలోని క్యారెక్టర్ కోసం చాలా బరువు పెరగాల్సి వచ్చిందట. దాంతో ఆ టైమ్‌లోనే ఎగ్ ఫ్రీజింగ్ ప్రాసెస్ కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలిపింది. ఈ పక్రియ వల్ల బాడీలో హార్మోనల్ చేంజెస్ వచ్చి శరీరం కాస్త  ఉబ్బడం కామన్. ఎలాగూ సినిమా కోసం వెయిట్ గేన్ అవ్వాలి కాబట్టి ఆ రెండు నెలల బ్రేక్‌ను పర్ఫెక్ట్‌గా వాడుకుంటూ సైలెంట్‌గా ఈ మెడికల్ ప్రొసీజర్‌ను ఫినిష్ చేసినట్లు కృతిసనన్ తెలిపింది.ఆ సమయంలో మూడ్ స్వింగ్స్, ఫిజికల్ అండ్ ఎమోషనల్ చేంజెస్ ఫేస్ చేశానని కృతి చాలా ఓపెన్‌గా ఒప్పుకుంది. ఒక ప్రెగ్నెంట్ ఉమెన్ ఎలాంటి రోలర్ కోస్టర్ రైడ్‌ను ఎక్స్ పీరియన్స్ చేస్తుందో, తాను కూడా దాదాపు అలాంటి ఒడిదుడుకులే చూశానని.. కానీ ఇప్పుడు మాత్రం మైండ్ చాలా పీస్‌ఫుల్‌గా ఉ ఒదంటూ హ్యాపీగా చెప్పుకొచ్చింది. నిజానికి ఇండియన్ స్క్రీన్ పై ఈ మోడ్రన్ బాట పట్టిన ఫస్ట్ సెలబ్రిటీ కృతి కాదు. గ్లోబల్ ఐకాన్ ప్రియాంక చోప్రా తన థర్టీస్ స్టార్టింగ్‌లోనే ఎగ్స్ ఫ్రీజ్ చేసుకోగా.. ప్రొడ్యూసర్ ఏక్తా కపూర్,  మోనా సింగ్, రిచా చద్దా వంటి వారు కూడా ఇదే రూట్ ఎంచుకున్నారు. మరి కృతి సనన్ ఈ విషయాన్ని బయట పెట్టిన తర్వాత ఇంకెంతమంది ఈ బాట పడతారో చూడాలి.

# ఇక నుంచి అలాంటి సినిమాలే చేస్తా

## కాజల్ అగర్వాల్

స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ మాతృత్వం తర్వాత తనలో వచ్చిన మార్పులను ఆసక్తికరంగా పంచుకున్నారు. ప్రస్తుతం 'ది ఇండియా స్టోరీ', 'రామాయణ' చిత్రాల విడుదలకు సిద్ధమవుతున్న సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఆమె.. ఇకపై కథల ఎంపికలో మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తానని తెలిపారు. కొడుకు నీల్ పుట్టిన తర్వాత ప్రతి కథను అతడి కోణంలోనే ఆలోచిస్తున్నానని కాజల్ చెప్పారు. భవిష్యత్తులో తన తల్లి మంచి సినిమాలు చేసిందని కొడుకు గర్వంగా చెప్పుకునేలా ఉండే కథలనే ఎంపిక చేయాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. అందుకే నటనకు ప్రాధాన్యం ఉన్న, మంచి సందేశం ఇచ్చే సినిమాలకే ప్రాధాన్యం ఇస్తున్నానన్నారు. 'రామాయణ'లో మండోదరి పాత్ర పోషిస్తున్నానని చెప్పగానే నీల్ ఎంతో ఆనందపడ్డాడని కాజల్ తెలిపారు. అతడికి రామాయణ కథలు, ముఖ్యంగా రావణుడి పాత్ర అంటే చాలా ఇష్టమని చెప్పారు. ఈ సినిమా రెండో భాగం విడుదలయ్యే సమయానికి నీల్ థియేటర్‌లో చూసే తొలి చిత్రం ఇదేనని పేర్కొన్నారు. 'ది ఇండియా స్టోరీ' గురించి మాట్లాడుతూ.. కల్తీ ఆహారం, పురుగుల మందుల వల్ల కలిగే ప్రమాదాలను ఈ చిత్రం చూపిస్తుందని చెప్పారు. ఈ సినిమా కోసం చేసిన అధ్యయనం తన వ్యక్తిగత జీవితంపైనా ప్రభావం చూపిందని, కుటుంబ సభ్యుల ఆహారపు అలవాట్ల విషయంలో ఇప్పుడు మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నానని కాజల్ వెల్లడించారు.



# సత్లుజ్ మూవీని చూడాలి..చూపించాలి

## ఎక్స్ వేదికగా దర్శకుడు రమ్‌గోపాల్ వర్మ



ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చకు దారి తీసిన చిత్రం 'సత్లుజ్'. సెన్సార్ సమస్యల కారణంగా నేరుగా ఓటీటీలో విడుదల చేయగా.. ఆ తర్వాత దాన్ని తొలగించారు. ఈ మూవీని చూసిన దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ ఎక్స్ వేదికగా తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. 'సత్లుజ్' మూవీ చూశా. ఇది సినిమా కాదు. ఎప్పటికీ నయం కానీ బలమైన గాయం. మన చరిత్రలోని చీకటి అధ్యాయాన్ని గుర్తు చేస్తుంది. దిల్జిత్ దొసాంజే గుండెలు బాదుకునేలా నటించలేదు. మనఃసాక్షికి అనుగుణంగా ఎంతో నిశ్శబ్దంగా చేసుకుంటూ వెళ్లాడు. అర్జున్ రామ్‌పాల్ నటన అదనపు బలాన్ని ఇచ్చింది. నేరాల్లో వ్యవస్థలు భాగమైన తీరును వాస్తవికతతో చూపించారు. ఈ సినిమాను సంచలనం చేయడం కన్నా.. ఒక ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా తీర్చిదిద్దారు. తెరపై అధికారిక ఫైళ్లు, దహన సంస్కారాల వివరాలు, గుసగుస సంభాషణలు వంటివి ఈ కథలోని తీవ్రతను తెలియజేశాయి. స్వలాభం కన్నా.. సత్యాన్ని వెల్లడించేలా తీర్చిదిద్దడంతో ఇది మరింత బలంగా తెరపై ఆవిష్కృతమైందని రామ్ అన్నారు. ప్రజాస్వామ్యం తన పౌరులనే కబళించి, అందుకు సాక్ష్యాలు లేకుండా ఎలా తుడిచేస్తుందో సినిమాలో తెలియజేయడం సాధారణ విషయం కాదు. ఈ విషయంలో చిత్ర బృందం తనవంతు బాధ్యతను చక్కగా పూర్తి చేసింది. ఇదే నిజమైన కళ. ఇది నిజంగా అత్యంత ధైర్యవంతమైన ఫిల్మ్ మేకింగ్. ఈ సినిమా చాలా మందిని కలవరపెడుతుంది.. అవగాహన కల్పిస్తుంది.. ఎక్కువ ప్రభావం చూపిస్తుంది. సత్యం, నిజాయతీని సినిమా మాధ్యమం ద్వారా చెప్పినప్పుడు అది 'సత్లుజ్' అవుతుంది. ఇలాంటి సినిమాను చూడాలి. చూపించాలి. చర్చించాలి. కానీ, సినిమాలో బాధితులను చేసినట్లు ఎన్‌కౌంటర్ చేయకూడదు. అధికారంలో ఉన్న వారందరికీ నా విన్నపం ఏంటంటే.. 'సత్లుజ్'లో జస్వంత్ సింగ్ ఖల్రా'ను చేసినట్లు ఈ సినిమాను చేయకండి. నిజాన్ని దాచాలనుకుంటే అది మరింత దృఢంగా మారుతుందని వర్మ అన్నారు.

# హైదరాబాద్‌లో శరవేగంగా చిరు మూవీ షూట్

చిరంజీవి హీరోగా బాబీ దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోన్న విషయం తెలిసిందే.  మెగా158 వర్కింగ్ టైటిల్ గా ప్రచారంలో ఉన్న దీనిపై టీమ్ అప్‌డేట్ పంచుకుంది. షూటింగ్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోందని తెలిపింది. మునుపెన్నడూ చూడని భారీ యాక్షన్ సన్నివేశాలు ఉంటాయని.. చిరును కొత్త కోణంలో చూస్తారని వెల్లడించింది. రామ్-లక్ష్మణ్ మాస్టర్స్ సారథ్యంలో భారీ యాక్షన్ సన్నివేశాలు షూట్ చేస్తున్నారు. సినిమాకు ఈ సీన్స్ హైలైట్‌గా నిలవనున్నాయి. చిరు ఇందులో రిస్క్‌తో కూడిన స్టంట్స్ చేస్తున్నారని.. త్వరలో దీని టైటిల్ టీజర్‌ను విడుదల చేయనున్నట్లు టీమ్ వెల్లడించింది. 'వాల్తేర్ వీరయ్య' విజయం తర్వాత  చిరంజీవి - బాబీ కాంబోలో ఈ చిత్రం రానుండడంతో అంచనాలు నెలకొన్నాయి. ఇటీవలే పొల్లాచ్చిలో ఓ కీలక షెడ్యూల్‌ని పూర్తి చేసుకుంది. అక్కడ కొంత టాకీతో పాటు కొన్ని యాక్షన్ సీక్వెన్స్ కూడా తీసినట్లు ప్రచార చిత్రాన్ని కూడా విడుదల చేశారు.




Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com